దివ్యాంగుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

వాకర్స్‌కు ఊరట.. కాలేజ్ గ్రౌండ్‌లో మట్టి కుప్పల తొలగింపు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 197 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 13 జులై 2026

## పవన్‌కల్యాణ్‌కు శస్త్ర చికిత్స.. పరామర్శించిన చంద్రబాబు



**అమరావతి,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సీఎం చంద్రబాబు నాయుడు ముంబాయిలో పరామర్శించారు. భుజం నొప్పితో బాధపడుతున్న పవన్‌కల్యాణ్ శనివారం ముంబాయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్

మిగతా2లో...

## విజయవాడలో ఏడు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి



**హైదరాబాద్,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):**నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మిగతా2లో...

## క్షిపణుల తయారీలో ప్రైవేట్ సంస్థలు

● కేంద్రంలోని మోడీ సర్కారు పన్నాగాలు ● తొలి దశలో అస్త్ర మార్క్-2 క్షిపణులు! ● ఉత్పత్తి లక్ష్యాల భారం పేరిట బీడీఎల్ నిర్వీర్యం ● రక్షణ ఉత్పత్తుల డిమాండ్ పెరగడంతో కొత్త వ్యూహమంటూ అడ్డదారి ● బరిలో ఐకామ్, అదానీ, ఫోర్జ్, టాటా, మహీంద్రా ● ముమ్మాటికీ దేశభద్రతకు ముప్పే : రక్షణశాఖ మాజీ సైన్యాధిపతులు




# కొత్త ఓటర్లకు మరో పరీక్ష

### - తల్లిదండ్రుల సర్ వివరాలు కోరుతున్న ఈసీ ఆన్‌లైన్ పోర్టల్

నిబంధనలు మార్చకుండానే ఫారం -6లో కొత్త షరతులు

కేంద్ర అధికారిక నోటిఫికేషన్ లేకుండానే మార్పులు

రాష్ట్రాలను బట్టి ఫారాల్లో మార్పులు చేస్తున్నారని సందేహాలు

పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న మాజీ ఎన్నికల అధికారులు






## కన్నీటి వీడ్కోలు

మైసూరులో అధికారిక లాంఛనాలతో జానకమ్మ అంత్యక్రియలు పూర్తి

అంతిమయాత్రలో భారీగా పాల్గొన్న అభిమానులు

**మైసూరు,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):**గానకోకిల ఎస్. జానకి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. కర్నా టక ప్రభుత్వం జానకమ్మ అంత్యక్రియలను మైసూరులో అధికారిక లాంఛనాలతో జరిపించింది. ఆమె అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకమ్మ కోరిక మేరకు కణియనహుండి ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అభిమాని ఫామ్ హౌస్ లో అంత్యక్రియలు హెచ్.డి. కోటే తాలూకాలోని కనియనహుండి గ్రామంలో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రంలో సాయంత్రం జానకి అంత్యక్రియలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ మిగతా2లో...

## బీఆర్ఎస్ దెబ్బతో సర్కార్ గోదారి బాట..

● కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టిస్తున్న కేటీఆర్

● నేడు దేవాదులకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

● నీటి విడుదలపై ప్రశ్నిస్తుండటంతో సర్కార్ ఉక్కిరిబిక్కిరి



**వరంగల్,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ దెబ్బతో కాంగ్రెస్ ప్ర భుత్వం దిగొచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 5న కన్నెపల్లిలో పర్యటించడం, గోదావరిలో నీళ్లున్నప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే దిగువకు విడిచిపెడుతున్నదనే విషయాన్ని కుండ బద్ధలు కొట్టినట్టు వెల్లడించడంతో ప్రభుత్వ పెద్దలు ఎట్టకేలకు గోదారి బాట పట్టారు. కానీ, కన్నెపల్లికి వెళ్లి గోదావరిని పరిశీలిస్తే తమ సర్కార్ నవ్వుల పాలవుతుందన్న భయంతో సోమవారం దేవాదుల ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించనున్నారు. ఐదు నెలల క్రితం బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు దేవాదుల ప్రాజెక్టులో భాగమైన దేవన్నపేట పంప్‌హౌస్‌ను పరిశీలించినప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇదేవిధంగా వ్యవహరించింది. వరిరై తులను ఆదుకునేందుకు వెంటనే దేవాదుల పంపులను ఆన్ చేయాలని ఆ పర్యటన సందర్భంగా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంతో మరుసటి రోజు తెల్లారే మిగతా2లో...

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధణలో ప్రభుత్వం విఫలం: బిజెపి చీఫ్



**హైదరాబాద్,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):**కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఆదివారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రభుత్వ చేతగానితనం వల్లే ఉత్తర తెలంగాణకు సాగు, తాగు నీరు అందడం మిగతా2లో...



## ఆర్ అండ్ బీ దేశంలోనే నెంబర్ వన్

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత : రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హ్యామ్ (హెచ్‌ఏఎం) పథకం బీటీ రోడ్ల నిర్మాణం, నార్కట్‌పల్లి -మునుగోడు రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

**యాదగిరిగుట్ట,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖను అన్ని రంగాల్లో నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం యాద్రాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి వద్ద సుమారు రూ. 358 కోట్లతో హ్యామ్ (హెచ్ ఏఎం) పథకం కింద చేపట్టనున్న పలు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అంతకుముందు రాయగిరి నుంచి వంగపల్లి గ్రామం వరకు దాదాపు వెయ్యి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో

మిగతా2లో...

## పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే మేడిగడ్డపై కుట్ర

● గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ● ఇగో పక్కన పెట్టి తెలంగాణ రైతులను ఆదుకోండి ● ఎన్టీపీసీతో పాటు హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తప్పవు : మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక



**హైదరాబాద్,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత రెండేండ్లుగా మేడిగడ్డకు మరమ్మత్తు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటార్లు బంద్ పెట్టి, నీళ్లను కిందకు వదిలేస్తూ ఆంధ్రా ఆయకట్టుకు మేలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో కరువు పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కా ముఖ్యమని నిపుణులు చెబుతున్న మాటలను సీఎం ఖాతరు చేయడం లేదన్నారు. ప్రస్తుతం గోదావరిలో పారుతున్న 50 వేల క్యూసెక్కుల వరదను కన్నెపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. దేవాదులలో 10 మోటార్లు ఉంటే 4 మాత్రమే నడుపుతూ.. 2,500 క్యూసెక్కులు ఎత్తాల్సిన చోట కేవలం 1,200 క్యూసెక్కులు మాత్రమే ఎత్తుతున్నారని ఆరోపించారు. ఫలితంగా వరంగల్, ధర్మసాగర్, పాలకుర్తిల్లో 75 శాతం చెరువులు ఎండిపోయాయని ఆందోళన

మిగతా2లో...

## విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయానికి భూమిపూజ



# కొత్త ఓటర్లకు మరో పరీక్ష

**న్యూఢిల్లీ,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారి కోసం ఉపయోగించే ఫారం-6లో ఎన్నికల సంఘం (ఈసీ) కొర్రీ పెట్టింది. ఎలాంటి చట్టపరమైన సవరణలు లేకుండా, నిబంధనలను మార్చకుండా కొత్త డిక్లరేషన్‌ను చేర్చింది. ఆ ఫారంలో దరఖాస్తుదారుడితో పాటు వారి తల్లిదండ్రుల పేర్లు, 2002 ఓటర్ల జాబితాలో వారి పేర్లు ఉన్నాయా లేదా అనే వివరాలు భర్తీ చేయాలని కోరుతున్నది. అయితే ఈ మార్పునకు అవసరమైన చట్టబద్ధ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం అనుసరించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఓ ఆంగ్ల దినపత్రిక ప్రధాన కథనాన్ని ప్రచురించింది. ఫారం -6 ను 18 ఏండ్లు పూర్తి చేసుకున్న వారు, భారత పౌరసత్వం పొందిన వారు, గతంలో ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడిన వారు మళ్లీ నమోదు చేసుకోవడానికి ఉపయోగిస్తారు. అయితే కొత్త ఓటర్లను ఆదిలోనే కట్టడి చేసే ప్రక్రియలో భాగంగా కేంద్రం ఆ దరఖాస్తులో కొత్త సమాచారాన్ని కోరుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం తన 'ఈసీఐనెట్' ఆన్‌లైన్ పోర్టల్‌లో పారం-6 నింపే సమయంలో 'జె', 'కె' విభాగాల మధ్య కొత్త డిక్లరేషన్ భాగాన్ని చేర్చారు. ఇందులో దరఖాస్తుదారుడు.. 1.నా పేరు గత సర్ ఓటర్ల జాబితాలో ఉంది, 2. నా తండ్రి, తల్లి, తాత, అమ్మమ్మ పేరు గత సర్ జాబితాలో ఉంది. 3. నా పేరు గానీ, నా తల్లిదండ్రుల పేరు గాన్ గత సర్‌లో లేదు అంటూ ఈ మూడు ఎంపికల్లో ఒకదానిని తప్పనిసరిగా ఎంచుకోవాల్సి వస్తోంది. మొదటి రెండు ఎంపికల్లో ఏదైనా ఎంచుకుంటే.. సంబంధిత అసెంబ్లీ నియోజ కవర్గం, పోలింగ్ బూత్ నంబర్, సీరియల్ నంబర్ వంటి వివరాలను కూడా నమోదు చేయాలని పోర్టల్ కోరుతోంది. అయితే, ఈ వివరాలు లేకపోతే మూడో ఎంపికను మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంది. కానీ అలా ఎంపిక చేస్తే తర్వాత ఏమవుతుందనే విషయంపై పోర్టల్ ఎలాంటి వివరణ లేదు. ఆన్‌లైన్ ఫారం-6లో ఈ కొత్త డిక్లరేషన్ కనిపిస్తున్నప్పటికీ... అదే పోర్టల్‌లో డౌన్‌లోడ్ చేసుకునే ప్రింటెడ్ ఫారం-6లో మాత్రం ఈ కొత్త భాగం లేకపోవడం గమనార్హం. ఈ కొత్త నిబంధన బీహార్, అసోం మినహా సర్ పూర్తయిన, ప్రస్తుతం కొనసాగుతున్న ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలన్నింటిలో కనిపిస్తున్నది. ఈ మార్పులు సర్ ప్రక్రియతో అనుసంధానమై ఉన్నాయి. గతేడాది నుంచి దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో (యూటీలు) జరిగిన సర్‌లో 5.58 కోట్ల మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన విషయం తెలిసిందే. ఇందులో ఒక్క పశ్చిమ బెంగాల్‌లో 27 లక్షలకుపైగా ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. దీంతో వారి పిల్లల ఓటరు నమోదుపై కూడా ఆ ప్రభావం కనిపిస్తుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్-28 ప్రకారం ఓటరు నమోదు నిబంధనల్లో మార్పులు చేయడానికి కేంద్ర ప్రభుత్వమే అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈసీతో సంప్రదించిన తర్వాత కేంద్ర న్యాయశాఖ ఈ మార్పులను ప్రకటించాల్సి ఉంటుంది. ఫారం-6 కూడా ఎన్నికల నమోదు నిబంధనలు, 1960 (రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్) కింద ఉన్న చట్టబద్ధ ఫారం. అందువల్ల అందులో మార్పులు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఒదేనని ఎన్నికల సంఘం మాజీ అధికారులు చెబుతున్నారు. "చట్టంలో, నిబంధనల్లో సవరణ లేకుండా ఎన్నికల సంఘం స్వయంగా ఫారం-6లో మార్పులు చేయడానికి అధికారం లేదు. ఫారంలో ఎక్కడైనా ఒక కామా (,) కూడా ఈసీ తనంతట తాను జోడించలేదు" అని ఇద్దరు మాజీ సీనియర్ ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. దీనికి ఉదాహరణగా 2021లో ఆధార్ సంఖ్యను ఓటరు నమోదులో చేర్చేందుకు పార్లమెంట్ చట్ట సవరణ చేసిన తర్వాత, 2022 జూన్‌లో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్ ద్వారా ఫారం-6లో మార్పులు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. అయితే ప్రస్తుత మార్పులపై ఎన్నికల సంఘం నుంచి స్పందన రావాల్సి ఉంది. దీనిపై స్పందించేందుకు కేంద్ర న్యాయశాఖ కార్యదర్శి అందుబాటులోకి రాలేదు. ఈ పరిణామం నేపథ్యంలో చట్టబద్ధ సవరణలు లేకుండానే ఆన్‌లైన్ ఫారం-6లో కొత్త వివరాలు కోరడం రాజ్యాంగం, పరిపాలనా పరంగా సమంజసమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# బీఆర్ఎస్ దెబ్బతో సర్కార్ గోదారి బాట..

(మొదటి పేజీ తరువాయి)

(ఫిబ్రవరి 22న) సీఎం రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదులలో పర్యటించారు. నిలదీస్తే కానీ కదలరా?రైతుల కష్టాలను దూరం చేయాలని బీఆర్ఎస్ అడిగితే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కదిలే పరిస్థితి లేదని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. గోదావరి నీటి వినియోగ అంశమే ఇందుకు ఇందుకు తాజా నిదర్శనం. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఏర్పడటంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 5న జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధాన భాగమైన కన్నెపల్లి పంప్‌హస్ వద్ద గోదావరి నీటి లభ్యతను పరిశీలించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతు వ్యతిరేక వైఖరిని కేటీఆర్ తూర్పారబట్టారు. దీంతో ఉక్కిరి బిక్కిరైన రేవంత్‌రెడ్డి.. స్వయంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి, గోదావరిలో నీళ్లు ఉన్నాయని అనివార్యంగా ఒప్పుకోవాల్సి వచ్చింది. కానీ, మేడిగడ్డ బరాజ్ కుంగుబాటును సాకుగా చూపుతూ నీళ్లు ఎత్తిపోయబోమని తేల్చిచెప్పారు. దీంతో కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని కాళేశ్వరం పరీవాహక ప్రాంతంలోని రైతులతోపాటు రిటైర్డు ఇంజినీర్లు, తెలంగాణ మేధోసమాజం నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి అధికమైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పెద్దలు గోదావరిని పరిశీలించేందుకు దేవాదులకు పయనమవుతున్నారు. **నాడు హరీశ్.. నేడు కేటీఆర్** రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బీఆర్ఎస్ అడుగడుగునా ముచ్చెమటలు పట్టిస్తున్నది. గోదావరిలో నీరున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రైతులకు సాగునీటి కష్టాలు తెచ్చిపెడుతున్నదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఫిబ్రవరి 21న దేవన్నపేట పంప్‌హౌస్‌ను పరిశీలించి దుయ్యబట్టడంతో ఆ మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి గోదావరి తీరంలోని దేవాదుల ప్రాజెక్టు పనితీరుపై సమీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఇదేవిధంగా కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద దాదాపు 1 లక్ష క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నదని, అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు కండ్లల్లో ఆనందం కోసమే గోదావరి నీటిని దిగువకు వదిలిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 5న ధ్వజమెత్తారు. ఆ నీటిని ఎత్తిపోయకుంటే వేలాదిగా తరలివచ్చి కన్నెపల్లి పంపులను ఆన్ చేస్తామని అల్టిమేటం జారీచేయడంతో కాంగ్రెస్ సర్కార్ నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి గోదావరి నీటిపారుదల, వరద ప్రవాహం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, కన్నెపల్లి పంప్‌హౌస్ తదితర అంశాలపై నోరు విప్పారు. ఈ నేపథ్యంలో తక్షణ ఉపశమన చర్యగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క తదితరులు సోమవారం దేవాదుల వద్ద గోదావరి నీటి ప్రవాహాన్ని పరిశీలించనున్నారు.

# ఆర్ అండ్ బీ దేశంలోనే నెంబర్ వన్

(మొదటి పేజీ తరువాయి)

రూ.76 కోట్లతో నిర్మించనున్న నార్కట్‌పల్లి--మునుగోడు సేతుబంధు (సీఆర్ఐ) రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. మెరుగైన రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అదే క్రమంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తూ మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయ్యితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపడ్తాయని అన్నారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, మరిన్ని అభివృద్ధి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. నల్లగొండ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రోడ్లు, సాగునీరు, వ్యవసాయం, తదితర రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎక్కువ స్థాయిలో ధాన్యం పండిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలోనే ధాన్యం అత్యధికంగా పండించిన జిల్లా నల్లగొండ జిల్లా అని అన్నారు. నార్కట్‌పల్లి--మునుగోడు రహదారి అభివృద్ధి పనుల్లో స్థానిక రైతుల భూములకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సైతం దశలవారీగా పూర్తి చేస్తామని చెప్పారు. రూ.600 కోట్లతో హ్యాం రోడ్లను, రూ.4000 కోట్లతో రాష్ట్రంలో అన్ని రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2028లో ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం పూర్తి చేసి నార్కట్‌పల్లి మండల ప్రజలకు తాగు, సాగు నీరు అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, కలెక్టర్ బి.చంద్రశేఖర్, సేతు బందు సీఆర్ఐఎఫ్ చీఫ్ వసంతనాయక్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే మేడిగడ్డపై కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు.మొన్నటి వరకు గోదావరిలో నీళ్లే లేవని అబద్ధం చెప్పిన సీఎం... పారుతున్న గోదావరిని లైవ్ లో చూపించగానే మాటమార్చి కొత్త పల్లవి ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి మోటార్లు ఎలా నడుపుతారంటూ అవగాహన లేకుండా మాట్లాడుతున్నా రని దుయ్యబట్టారు.2028లో 28 లక్ష?లు, 2025లో 15లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా భద్రాచలానికి ఎలాంటి ముప్ప జరగలేదని గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్ల రెండు బ్యారేజీల్లో మొత్తం 8 టీఎంసీలంటే దాదాపు 80 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వ ఉంటుందని చెప్పారు. ఇదే విషయాన్ని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లు చెబితే సీఎం జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. నిన్నటి దాకా నిపుణుల కమిటీ, రిటైర్డ్ ఇంజినీర్లు అని చెప్పిన సీఎం.. ఇప్పుడు నీళ్లు ఎత్తమని టెక్నికల్ సూచన చేయగానే వారిని జైల్లో పెడతామని బెదిరిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ రిటైర్డ్ ఇంజనీర్లు మేడిగడ్డ సాధ్యం కాదని చెప్పలేదని గుర్తు చేశారు. మిడ్ మానేరుకు నేరుగా నీళ్లు తీసుకెళ్లడం కష్టం కాబట్టి, వరస బ్యారేజీలు కట్టి ఎల్లంపల్లి ద్వారా తీసుకెళ్లమని జస్టిస్ ఘోష్ కమిషన్‌కు అఫిడవిట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులు రూ. 8.5 కోట్ల ఖర్చుతో కాపర్ డ్యాం కట్టడం ద్వారా నీళ్లు ఎల్లంపల్లికి తీసుకువెళ్లొచ్చంటూ ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.మేడిగడ్డపై రిపోర్ట్ ఇచ్చిన ఎన్డీఎస్ఏ చైర్మెన్ చంద్రశేఖర్ అయ్యర్, అతుల్ జైన్‌ల హయాంలోనే పోలవరం కాపర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ ఆరు సార్లు కొట్టుకుపోవడం వల్ల రూ.7 వేల కోట్లకు పైగా నష్టం జరిగిందన్నారు. అలాంటి వారికి ప్రమోషన్లు ఇచ్చి ఇక్కడకు పంపితే మేడిగడ్డ 3 పిల్లర్ల కుంగుబాటుపై రిపోర్టులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. హిట్లర్ తనకు ఆదర్శం అన్న రేవంత్ రెడ్డి, అదే హిట్లర్ తరహాలో హంతక భాష మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇగోలకు, పంతాలకు పోయి రైతుల పంటలను ఎండబెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. తక్షణమే కన్నెపల్లి, దేవాదుల మోటార్లను పూర్తిస్థాయిలో ఆన్ చేసి రాష్ట్రాన్ని కరువు బారి నుంచి కాపాడలని సూచించారు. లేదంటే ఎన్టీపీసీ, సింగరేణితో పాటు హైదరాబాద్‌కు తాగునీటికి కష్టాలు తప్పవన్నారు. అదే జరిగితే ఎండిన ప్రతి పంటకు, రాలిన ప్రతి రైతు కన్నీటి బొట్టుకు తెలంగాణ సమాజం సీఎంను దోషిగా నిలబెడుతుందని హెచ్చరించారు.

# పవన్‌కల్యాణ్‌కు శస్త్ర చికిత్స.. పరామర్శించిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

అంబానీ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు.ఏపీ సీఎంతో పాటు మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్ తదితరులు పరామర్శించారు.అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ గత కొంతకాలంగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్న పవన్‌కల్యాణ్ వైద్య నిపుణుల సూచనల మేరకు చేయించకున్న ఆపరేషన్ విజయవంతమైందన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రెండువారాల విశ్రాంతి అనంతరం పవన్‌కల్యాణ్ విధుల్లో పాల్గొంటారని వివరించారు. ఎడమ భుజానికి కూడా ఆపరేషన్ అవసరమా? కాదా? అని వైద్యుల సూచన మేరకు జరుగుతుందన్నారు.

# విజయవాడలో ఏడు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి

(మొదటి పేజీ తరువాయి)

మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# క్షిపణుల తయారీలో ప్రైవేట్ సంస్థలు

**న్యూఢిల్లీ,జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రంలోని మోదీ సర్కార్ భారత రక్షణ ఉత్పత్తుల విధానంలో కీలక మార్పులు చేయబోతున్నది! క్షిపణుల తయారీ ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన 'అస్త్రా మార్క్-2' క్షిపణి తయారీ కోసం ప్రైవేట్ సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించే అవకాశముందని, దీనికి ఇండోనేషియా ఆసక్తి కనబర్చినట్టు జాతీయ మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి.ఐకామ్, అదానీ, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ నుంచి బిడ్లు దాఖలయ్యే అవకాశముందని తెలిసింది. యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఫిరంగి, నౌకాదళ ప్లాట్‌ఫామ్ వంటి రంగాల్లో భారత్ ఇప్పటికే ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించింది. క్షిపణుల రంగాన్ని కూడా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించటం ద్వారా, అస్త్రా మార్క్-2 మొదటి ప్రైవేట్ తయారీ క్షిపణి అవుతుందని వార్తా కథనాలు వెలువడ్డాయి.

# కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు పూర్తి అధికారిక లాంఛనాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జానకి కుమారుడు మురళీకృష్ణ ఈ ఏడాది జనవరిలోనే మరణించడంతో ఆమె మనవరాలు అప్సర దహన సంస్కార కార్యక్రమాలు నిర్వహించారు. కనియనహుండి గ్రామంలోని జానకి అభిమాని నవీన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఈ అంత్యక్రియలు జరిగాయి. **భావోద్వేగానికి గురైన అభిమానులు** ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహారాజా కాలేజ్ మైదానంలో సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, కళాకారులు, వేలాది మంది అభిమానులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ నివాళులర్పించారు. అంతిమ సంస్కారాల కోసం ఆమె భౌతికకాయాన్ని హెచ్.డి. కోటె తాలూకాలోని కనియనహుండి తోటలోకి తరలించారు. అక్కడ కాసేపు అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచారు. మధ్యాహ్నం 3:05 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభమైంది. ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు, అధికారులు వాహనాల్లో వెంట వెళ్లారు. తమ అభిమాన గాయనికి చివరిసారిగా అభిమానులు దారి పొడవునా నీరాజనం పట్టారు. పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధణలో ప్రభుత్వం విఫలం: బిజెపి చీఫ్

(మొదటి పేజీ తరువాయి)

లేదని ఆయన మండిపడ్డారు. ఎన్‌డిఎస్ఏ నివేదికలను పట్టించుకోకుండా మూడు వర్కింగ్ సీజన్లను వృథా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టి తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల పునరుద్ధరణ పనులు ఆలస్యం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నుంచి 200 టిఎంసిల నీటిని వినియోగించుకునే అవకాశం కోల్పోయిందని ఆయన విమర్శించారు. ఎన్‌డిఎస్ఏ సమగ్ర పరిశీలన చేసి, సాంకేతికతను పరిశీలించి, పునరుద్ధరణకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా చేసిన సూచనలను పెడచెవిన పెట్టారని ఆయన విమర్శించారు. ముందే పునరుద్ధరణ పనులు చేపట్టి ఉంటే ఉత్తర తెలంగాణలో సుమారు ఇరవై నుంచి ఇరవై ఐదు లక్షల ఎకరాలకు నీరు అందేదని, హైదరాబాద్‌కూ తాగు నీటి సమస్య ఉండేది కాదని ఆయన తెలిపారు.విజిలెన్స్ నివేదికను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పినాకిని చంద్ర ఘోష్ కమిషన్ ముందు రాష్ట్ర ప్రభుత్వం తన వాదనను సక్రమంగా వినిపించడంలో విఫలమైందని ఆయన తూర్పారపట్టారు. పంప్ హౌస్‌లు, టన్నెల్లు, రిజర్వాయర్లతో సహా మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రూ. 1.30 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరంపై సమగ్ర విచారణ జరిపించేందుకు ఎందుకు వెనుకాడుతున్నారని రాంచందర్ రావు తన లేఖలో ప్రశ్నించారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**జగిత్యాల, జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం సమీపంలోని చలగల్ వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్రీయ విద్యాలయం కోసం వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలోని ఐదు ఎకరాల విలువైన భూమిని కేటాయించినట్టు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జగిత్యాల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో అండగా ఉంటామని అన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయాలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలుస్తున్నాయని చెప్పారు. జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయడం జిల్లాకు గొప్ప అవకాశమని, త్వరలో తాత్కాలిక భవనంలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ?ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం రావడం గర్వకారణమని, విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు.

# కొలువుదీరిన వెంకటేశ్వరుడు

### అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

### గోవింద నామస్మరణతో మారుమోగిన అయ్యప్ప ఆలయం..

### స్వామివారిని దర్శించుకున్న వందలాది భక్తులు





**పరకాల, జూలై 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ పాలకుర్తి గౌతమ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ, ఆలయ ధర్మకర్త, ప్రముఖ వైద్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో భక్తుల 'గోవింద... గోవింద...' నామస్మరణ మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పరకాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిటకిటలాడగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా అయ్యప్ప స్వామిని దర్శించుకొని కోరుకున్న కోరికలు నెరవేరాయని, ఇప్పుడు శ్రీ వెంకటేశ్వర స్వామి కూడా కొలువుదీరడంతో ఆలయ మహిమ మరింత పెరిగిందని, భక్తుల రద్దీ మరింత అధికమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### వీరయ్యఖమ్మంలో 'దివ్యాంగుల చెంతకు వీరయ్య2' ప్రజా నివేదిక సభ.. ఘనంగా ఆత్మీయ సమ్మేళనం








**ఖమ్మం,ప్రతినిధి జులై 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య స్పష్టం చేశారు. ఖమ్మం టౌన్‌లోని టీఎన్‌జీవో ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం జిల్లా దివ్యాంగుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంచం ఉప్పలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన "దివ్యాంగుల చెంతకు వీరయ్య2" ప్రజా నివేదిక సభ, దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ, ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.2 లక్షల కళ్యాణలక్ష్మి సహాయం అందిస్తున్నామని, విద్యలో 5 శాతం రిజర్వేషన్ కల్పించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 2 వేల మంది దివ్యాంగులకు ఉపాధి కల్పించే బండ్లు పంపిణీ చేశామని చెప్పారు. జీఓ34 ద్వారా ఉద్యోగులకు పదోన్నతి వచ్చిన చోటే కొనసాగేందుకు అవకాశం కల్పించామని, 2010, 2015, 2020 పీఆర్సీలకు సంబంధించిన అంశాలను తొలి బోర్డు సమావేశంలోనే విడుదల చేశామని పేర్కొన్నారు. అలాగే ఓ దివ్యాంగ మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, జిల్లాలోని ముగ్గురు మంత్రులతో చర్చించి దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వారికి అందాల్సిన ఉపాధి, సంక్షేమ పథకాలు చేరేలా తన వంతు బాధ్యత నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్త మురళి మాట్లాడుతూ, దివ్యాంగులు ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి, సంక్షేమ పథకాలను సాధించుకునేలా తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఖమ్మం జిల్లా దివ్యాంగుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో దివ్యాంగుల కోసం 1000 గజాల స్థలంలో భవనం నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారని తెలిపారు. ఆ భవనాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అలాగే దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా స్టడీ సర్కిల్ చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు తమ విద్యాసంస్థలో ట్యూషన్ ఫీజుతో పాటు పరీక్ష ఫీజును కూడా పూర్తిగా ఉచితంగా భరిస్తామని ప్రకటించారు. జిల్లా దివ్యాంగుల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాటికొండ రమేష్, గౌరవ అధ్యక్షులు కోటి, ప్రధాన కార్యదర్శి ఈడబోయిన సురేష్, మధిర అధ్యక్షుడు యూసఫ్, బోనకల్ అధ్యక్షుడు షేక్ ముస్త ఫా, ఎంపీఆర్‌డీ అధ్య క్షుడు డోన్‌వాన్ నాగరాజు, జిల్లా నాయకులు బండి వెంకటరమణ, వడ్డేపూడి లక్ష్మయ్య, షేక్ జానీ, తెల్ల ప్రవీణ్ కుమార్, మురళి వివిధ దివ్యాం గుల సంఘాల ప్రతినిధులు, దివ్యాంగ మిత్రులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు టీజేఎఫ్ ఘన సన్మానం

### తెలంగాణ ప్రజల గొంతుకగా పార్లమెంట్లో మరింత సమర్థంగా వినిపించాలి: ఆకుతోట ఆదినారాయణ

### పార్టీ నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటా.. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటా: వద్దిరాజు రవిచంద్ర



**ఖమ్మం,ప్రతినిధి జులై 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు. టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర రవి నాయకత్వంలో జర్నలిస్టుల బృందం రవిచంద్రకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ తనపై మరోసారి ఉంచిన విశ్వాసాన్ని సమర్థవంతమైన పనితీరుతో నిలబెట్టుకుంటూ, పార్లమెంటులో తెలంగాణ ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరింత బలంగా పోరాడతానని, రవిచంద్ర స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్లమెంటు ఫ్లోర్ లీడర్‌గా ఎంపిక కావడం వద్దిరాజు రవిచంద్ర రాజకీయ అనుభవానికి, పార్లమెంటులో ఆయన చూపుతున్న సమర్థ నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలను జాతీయ స్థాయిలో నిరంతరం ప్రస్తావిస్తూ, రాష్ట్ర హక్కుల సాధన కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ తెలంగాణ ప్రజల గొంతుకగా పార్లమెంటులో మరింత సమర్థంగా పనిచేసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆకాంక్షించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, తనపై మరోసారి విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి తెలంగాణ ప్రజల సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాలను పార్లమెంటు వేదికగా మరింత బలంగా వినిపించేందుకు నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. అలాగే జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తనను ఘనంగా సన్మానించిన టీజేఎఫ్ జిల్లా నాయకులకు, జర్నలిస్టు మిత్రులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యులు సాంబశివ రావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాసరావు, ప్రశాంత్ రెడ్డి,హరీష్, వనం నాగయ్య, మందుల ఉపేందర్, టెంజు జిల్లా కార్యదర్శి రజనీకాంత్, టౌన్ అధ్యక్షులు జగదీష్, టౌన్ కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, ఎస్.వి. రెడ్డి, యాదగిరి, రేపాక యాదగిరి, పులి శ్రీను, సహాయ కార్యదర్శి మూల జీవన్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ప్రచార కార్యదర్శులు కూరపాటి నరేష్, నల్లమోతు శ్రీనివాస్, సభ్యులు ఇస్సంపల్లి వెంకటేశ్వర్లు, నాగశేఖర్, మురళి, ఆర్.కే, నాగేశ్వరరావు,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### వాకర్స్‌కు ఊరట.. కాలేజీ గ్రౌండ్‌లో

# మట్టి కుప్పల తొలగింపు



**పరకాల, జూలై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని 22వ వార్డు కాలేజీ గ్రౌండ్‌లో పేరుకుపోయిన మట్టి కుప్పల కారణంగా వాకర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక కౌన్సిలర్ ఆల్లె దశరథం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ చొరవతో స్థానిక కౌన్సిలర్ ఆల్లె దశరథం ఆధ్వర్యంలో ఆదివారం కాలేజీ గ్రౌండ్‌లో ఉన్న మట్టి కుప్పలను తొలగించారు. దీంతో అక్కడ వాకింగ్‌కు వచ్చే ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పసుల లావణ్యరమేష్, కొయ్యడ శీను, బండి శ్రీధర్, పాలకుర్తి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ కోరిక మేరకు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు 22వ వార్డు ప్రజలు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## సాయిబాబా దేవాలయంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

### - 80 మంది శస్త్రచికిత్స కోసం హైదరాబాద్ శంకర ఐ హాస్పిటల్‌కు తరలింపు





**ఏటూరు నాగారం, జూలై 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో, శంకర ఐ హాస్పిటల్ సహకారంతో, రాహుల్ ఐ ఫౌండేషన్ ప్రోత్సాహంతో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. సాయిబాబా దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ కుమారుడు పెండ్యాల పవన్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటూరు నాగారం మండలంతో పాటు పరిసర ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పరీక్షల్లో 80 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారికి భోజన వసతి కల్పించి, ప్రత్యేక బస్సు ద్వారా హైదరాబాద్‌లోని శంకర ఐ హాస్పిటల్‌కు ఉచిత శస్త్రచికిత్స కోసం పంపించినట్లు సాయిబాబా దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ప్రతి నెలా ఒక రోజు నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా ఇప్పటికే 800 మందికి పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయించి, వారికి చూపు ప్రసాదించినట్లు ఆయన తెలిపారు. ఉచిత కంటి పరీక్షల సేవా కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రతి నెలా నిర్వహించే ఉచిత కంటి పరీక్షలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శంకర ఐ హాస్పిటల్ వైద్య బృందం, రాహుల్ ఐ ఫౌండేషన్ చైర్మన్ రాహుల్, దేవాలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## నైపుణ్యాల మెరుగుతోనే ఉజ్వల భవిష్యత్

### - ఓయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి







**హైదరాబాద్, జులై 12(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి అన్నారు. అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కాచిగూడ లోని మ్యాడం అంజయ్య హాల్ లో అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. కళాశాలలో చదివి ప్రస్తుతం ఉన్నత శిఖరాలను అధిరోహించిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పాత జ్ఞాపకాలను, అనుభవాలను తోటి విద్యార్థులతో ఉత్సాహంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగంలో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైనదని విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఇండస్ట్రీకి అవసరమైన స్కిల్ బేస్డ్ విద్యను అందించే విధంగా ఓయు కృషి చేస్తుందని ఆయన అన్నారు. 35 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి, విద్యార్థుల పురోభివృద్ధికి అవంతి విద్యా సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రియాంక, డాక్టర్ ఎం.ఎ. హమీద్, సూరంపూడి సోనియా శ్రీకాంత్, ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్, జక్కుల సత్యనారాయణ, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ వై.జయప్రద, ప్రొఫెసర్ ఎస్.అప్పారావు, డాక్టర్ స్వాతి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదవాడి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఇందిరమ్మ ఇండ్లు

### సొంతింటి కలను సాకారం చేస్తూ గుడిసెల లేని నూతన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం శ్రీకారం.







**ములుగు జిల్లా,జూలై 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగింది.మరోవైపు దశాబ్దాలుగా పేద కుటుంబాల జీవితాల్లో కలగానే మిగిలిపోయిన సొంతింటి కల ను నిజం చేస్తూ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసింది.ఎన్నో ఏళ్లుగా గుడిసెల్లో, అద్దె ఇళ్లలో, వర్షానికి తడుస్తూడ చలికి వణుకుతూడ కనీస భద్రత లేకుండా జీవనం గడిపిన పేద కుటుంబాలకు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లు పథకం కొత్త జీవితానికి నాంది పలుకుతోంది. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఐదు లక్షల రూపాయల గృహనిర్మాణ వ్యయాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.ఈ పథకం ప్రభావానికి నిలువెత్తు నిదర్శనం ములుగు జిల్లా....స్థానిక మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే అత్యధిక ఏజెన్సీ ప్రాంతంగా గుర్తింపు పొందిన ములుగు జిల్లాకు ఐదు వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం గిరిజన గుడాల్లో ఆనందోత్సవాలు వెల్లి విరిసాయి. వీటిలో ఇప్పటికే 1,315 మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు పూర్తి చేసి కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవనం సాగిస్తున్నారు.మంత్రి ప్రత్యేక చొరవ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం "గుడిసెలు లేని తెలంగాణ" లక్ష్యంగా ప్రతి అర్హత కలిగిన కుటుంబాన్ని గుర్తిస్తూ నిరంతర ప్రక్రియగా ఇళ్ల మంజూరు కొనసాగుతోంది.ఈ విజయానికి మరో ప్రత్యేక కోణం రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క చూపుతున్న ప్రత్యేక చొరవ. తన సొంత నియోజకవర్గమైన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది.దానికి ఉత్తమ ఉదాహరణ రాఘవపట్నంఇప్పలగడ్డ ప్రాంతం. ఈ ఏజెన్సీ గ్రామపంచాయతీని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి 90 మంది గిరిజన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడమే కాకుండా, అక్కడ నిర్మితమవుతున్న ఇందిరమ్మ ఇండ్ల సముదాయానికి లబ్ధిదారులే స్వచ్ఛందంగా "సీతక్క కాలనీ" అని పేరు పెట్టుకోవడం ప్రజా ప్రభుత్వంపై, మంత్రి సీతక్కపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనం.కొండాయి గ్రామం పేరు వినగానే జంపన్న వాగు వరదల కారణంగా గతంలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు గుర్తుకొస్తాయి. అలాంటి ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు శాశ్వత భద్రత కల్పించాలనే ఉద్దేశంతో సురక్షిత ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి కొత్త జీవితం అందించిన ఘనత కూడా ప్రజా ప్రభుత్వానికే దక్కుతుంది.మొదటి విడత విజయవంతంగా కొనసాగుతుండగానే, రెండో విడతలో కూడా ములుగు జిల్లాలో 3,430 గుడిసెలు ఉన్నట్లు అధికారుల గుర్తింపులోకి రావడంతో ఆయా కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబానికి కూడా తాత్కాలిక నివాసం లేకుండా ఉండకూడదనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు సరైన ఇల్లు లేకపోవడం వల్ల సామాజికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా యువతి, యువకులకు పెళ్లి సంబంధాలు వచ్చినా "సొంత ఇల్లు లేదు" అనే కారణంతో సంబంధాలు తిరస్కరించబడిన పరిస్థితులు ఉండేవి. కానీ నేడు ఇందిరమ్మ ఇల్లు ఉండటం ఒక కుటుంబ గౌరవానికి ప్రతీకగా మారింది.గతంలో "పెళ్లి చేసి చూడుడ ఇల్లు కట్టి చూడుడ" అనే సామెత ఉండేది. కానీ ప్రజా ప్రభుత్వం ఆ సామెతకే కొత్త అర్థం తీసుకొచ్చింది. సొంతింటి నిర్మాణం ఇక ధనవంతులకే పరిమితం కాదని, పేద కుటుంబాల కల కూడా సాకారం అవుతుందని ఇందిరమ్మ ఇండ్లు నిరూపిస్తున్నాయి.ఇది కేవలం గృహనిర్మాణ పథకం మాత్రమే కాదుడ పేదవాడి జీవితాన్ని మార్చే సామాజిక విప్లవం. భద్రమైన నివాసం, కుటుంబానికి గౌరవం, మహిళలకు రక్షణ, పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పిస్తూ పేదల జీవితాల్లో శాశ్వత మార్పుకు నాంది పలుకుతోంది.దశాబ్దాలుగా పేదవారి కలను నిజం చేసి, గుడిసెల్లో బతికిన కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించిన ఘనత నేడు ప్రజా ప్రభుత్వానికే దక్కుతోంది.ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ... రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.... ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశిస్తూ ముందుకు సాగుతున్నారు. గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణంలో ఇందిరమ్మ ఇండ్లు కీలక మైలురాయిగా నిలుస్తాయని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు.**లబ్ధిదారుల మాటల్లో** రాఘవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పలగడ్డ పైలెట్ ప్రాజెక్టు గ్రామానికి చెందిన తడండ్ల సుజాత మాట్లాడుతూ, "మాది పూర్తిగా గిరిజన గ్రామం. ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూశాం. మేము ఎప్పటికైనా సొంత ఇల్లు కట్టుకుంటామా అనే నిరాశలో ఉండేవాళ్లం. కానీ ప్రజా ప్రభుత్వం, మా స్థానిక మంత్రి సీతక్క చొరవతో ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల వ్యయంతో డబుల్ బెడ్‌రూమ్ తరహాలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం మా కుటుంబానికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు మా సొంతింటిలో గౌరవంగా జీవిస్తున్నాం" అని ఆనందం వ్యక్తం చేశారు.గోవిందరావుపేట మండలానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు తాటి శిరీష మాట్లాడుతూ, "మాకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. సొంత ఇల్లు లేకపోవడం వల్ల వారి భవిష్యత్తుపై ఎప్పుడూ ఆందోళన ఉండేది. మేముంటున్న పాత ఇల్లు ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతో పిల్లలతో రోజులు గడిపాం. ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలతో శాశ్వత నివాసంగా పక్కా ఇల్లు మంజూరు చేయడంతో ఇప్పుడు మా కుటుంబం సురక్షితంగా, సంతోషంగా జీవిస్తోంది. మా పిల్లల భవిష్యత్తుపై కూడా ధైర్యం వచ్చింది. ఈ అవకాశం కల్పించిన ప్రజా ప్రభుత్వానికి, మా మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు.

---

# నాణ్యత లోపమా... అధికారుల నిర్లక్ష్యమా...?

### నవ్విపోవుదురు నాకేంటి సిగ్గు...!

### మేము ఇంతే చేస్తాం మాకు ఎదురేంటి...







**కల్లూరు, జులై 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల సౌకర్యార్థం లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న బీటీ రోడ్లు పదేళ్లపాటు మన్నికగా ఉండాల్సి ఉండగా, కొన్ని చోట్ల పది నెలలు కూడా పూర్తికాకముందే దెబ్బతింటుండటం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మండల పరిధిలో పెద్దకోరుకొండి గ్రామము నుండి వెన్నవల్లి గ్రామానికి వెళ్ళే బిటి రోడ్డు తరచూ గుంతలు ఏర్పడటం, పైపొర ఊడిపోవడం వల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడిన చాలా సందర్భాలు వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నాణ్యమైన రహదారుల నిర్మాణమే లక్ష్యమని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పూర్తిగా పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. నిర్మాణ సమయంలో అవసరమైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడుతున్నారు. గతంలో అధికారులు పనులను తరచూ తనిఖీ చేసి, నాణ్యతను నిర్ధారించే చర్యలు తీసుకునేవారని, ప్రస్తుతం అలాంటి పర్యవేక్షణ లోపించిందని చెబుతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా ఉండాలంటే ప్రతి పని, ప్రతి బీటీ రోడ్డు, పనికి సాంకేతిక ప్రమాణాల ప్రకారం నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నాసిరకం పనులు చేసినట్లు విచారణలో తేలితే సంబంధిత కాంట్రాక్టర్లపై ఒప్పంద నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని, నిర్లక్ష్యం వహిస్తున్న, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పనులను ఆమోదించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని కోరుతున్నారు. నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి, ప్రతి దశలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహిస్తేనే మన్నికైన రహదారులు చక్కగా నిర్మితమవుతాయని, ప్రజాధనం వృథా కాకుండా సద్వినియోగమవుతుందని స్థానికులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

---

# కొనసాగుతున్న అధికారుల పోరాటం

### • 14వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



**సత్తుపల్లి , జులై 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధనకై సత్తుపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఈరోజుతో విజయవంతంగా 14వ రోజుకు చేరుకున్నాయి. యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ అధికారులు చేస్తున్న ఈ పోరాటం రోజురోజుకూ మరింత ఉధృతమవుతోంది. 14వ రోజు దీక్షా శిబిరంలో అడిషనల్ మేనేజర్ భాగ్యా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టి. కృష్ణ, మరియు జూనియర్ ఇంజనీర్, కె. రాజేందర్ పాల్గొని దీక్షలో కూర్చున్నారు. దీక్షా శిబిరానికి విచ్చేసిన తోటి అధికారులు, సిబ్బంది వారికి పూలమాలలు వేసి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలుగా అధికారులు శాంతియుత మార్గంలో నిరసన తెలుపుతున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సీఎంఓఏఐ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేనిచో ఈ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియాకు చెందిన సీఎంఓఏఐ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు మరియు సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

# అలుగునూరులో 133,134 పోలింగ్ బూత్‌లలో ముమ్మరంగా ఓటర్ల నమోదు ..

### - బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, శక్తి కేంద్ర ఇన్చార్జి బొంతల కళ్యాణ్ చంద్ర

**అలుగునూరు 12(పిసిడబ్ల్యూ న్యూస్ ):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు పరిధిలోని పోలింగ్ బూత్ 133, 134లలో ఓటర్ల నమోదు( ఎస్ ఐ ఆర్) ప్రక్రియ శరవేగంగా, పకడ్బందీగా కొనసాగుతుంది. ఆదివారం రోజున ఈ నమోదు ప్రక్రియను బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సదరు పోలింగ్ బూత్‌ల (శక్తి కేంద్రం) ఇన్‌ఛార్జి బొంతల కళ్యాణ్ చంద్ర స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ పోలింగ్ బూత్ 133 లో71 శాతం, 134 లో 79 శాతం నమోదు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. బిఎల్‌ఓ అధికారులు గౌరీ , లత లు మ్యాపింగ్ , ఓటర్ నమోదు వివరాలను విజయవంతంగా పూర్తి చేయడానికి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో బిఎల్‌ఓలు చూపుతున్న చొరవను, ఎన్నికల అధికారుల సమన్వయాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే, ఈ ప్రక్రియకు సహకరిస్తున్న స్థానిక ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా బాధ్యతాయుతంగా ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. బూత్ లెవల్ అధికారులతో పాటు పౌర సమాజం కూడా ఇందులో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఓటు హక్కు నమోదు చేసుకోని వారు ఎవరైనా ఉంటే, వెంటనే సంబంధిత బిఎల్‌ఓలను సంప్రదించి, దరఖాస్తు ఫారాలను అందజేయాలని ఆయన సూచించారు.



---

# తెలంగాణ ఎలక్ట్రిషన్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నికోలా టెస్లా జయంతి వేడుకలు





**ఉప్పల్ జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతపూర్‌లోని కమిటీ హాల్లో తెలంగాణ ఎలక్ట్రికల్ జేఏసీ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ శాస్త్రవేత్త నికోలా టెస్లా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వివిధ ఎలక్ట్రికల్ అసోసియేషన్ల ప్రతినిధులు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి నక్క యాదగిరి మాట్లాడుతూ, ప్రతి ఎలక్ట్రిషన్ వైర్మన్ పర్మిట్‌తో పాటు సూపర్వైజర్ పర్మిట్ కూడా పొందాలని పిలుపునిచ్చారు.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ, RR1, WR2 విధానాన్ని తెలంగాణ వ్యాప్తంగా అమలు చేయడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు.జేఏసీ నాయకుడు కొండ బాల్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎలక్ట్రిషన్లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.నేమాల బెనర్జీ, వై. వెంకటేశ్వర్లు, శ్రావణ్ కుమార్, రఘు, హరీష్, సామల శ్రీకాంత్ రెడ్డి, లాలు బాబు, ఆదినారాయణ తదితర నాయకులతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వివిధ ఎలక్ట్రికల్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని 1వ డివిజన్ హనుమాన్ నగర్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద 12.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు తదితర అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి కొనసాగుతుందని మేయర్ అన్నారు. అనంతరం స్థానిక ప్రజలు తమ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి భారీ అపర్ణ జితేందర్, 26 వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ,ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పురోహిత శిరోమణి బిరుదుతో బ్రహ్మశ్రీ డాక్టర్ కొమరగిరి పూర్ణాచారికి ఘన సత్కారం





**ఖమ్మం, ప్రతినిధి జులై 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** వైదిక సంప్రదాయాల పరిరక్షణలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ పురోహితుడు బ్రహ్మశ్రీ డాక్టర్ కొమరగిరి పూర్ణాచారికి ప్రతిష్ఠాత్మక "పురోహిత శిరోమణి" బిరుదు ప్రదానం చేయడం విశేషంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చీరాలలోని ఈశ్వరనారాయణ ఆస్ట్రో రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ గౌరవాన్ని ఆయన అందుకున్నారు. మహబూబాబాద్ జిల్లా చిలుకోయలపాడు గ్రామానికి చెందిన డాక్టర్ కొమరగిరి పూర్ణాచారి ప్రస్తుతం ఖమ్మం నగరంలో నివాసం ఉంటూ, వైదిక సంప్రదాయాల పరిరక్షణ, ధార్మిక సేవలు, పురోహిత వృత్తిలో విశేష కృషి, ఆధ్యాత్మిక విలువల ప్రచారంలో విశేష సేవలందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ యూనివర్సిటీ ఈ ప్రతిష్ఠాత్మక "పురోహిత శిరోమణి" బిరుదుతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక ప్రముఖులు, వేద పండితులు, శిష్యులు, భక్తులు పాల్గొని డాక్టర్ కొమరగిరి పూర్ణాచారిని అభినందించారు. ఆయన అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ డాక్టర్ కొమరగిరి పూర్ణాచారి మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం గురువుగారి ఆశీస్సులు, దైవానుగ్రహం, పెద్దల ప్రోత్సాహం, శిష్యుల సహకారం ఫలితమేనని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ధర్మ పరిరక్షణ, వైదిక సంప్రదాయాల ప్రచారం, సనాతన ధర్మ విలువల వ్యాప్తికి మరింత అంకితభావంతో సేవలందిస్తానని తెలిపారు.

# ప్రాణాపాయంలో గురుపత్ని...


**- దాతలూ... ఒక్క రూపాయి అయినా సరే, ఓ నిండు జీవితాన్ని నిలబెట్టండి!**

**- బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్ యశోదలో పోరాటం..**

**- వారానికి 2.20 లక్షల ఇంజెక్షన్..**

**- 18 వారాల పాటు చికిత్స**

**- చేతులెత్తి వేడుకుంటున్న హిందీ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కుటుంబం!**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అక్షరాలు నేర్పి ఎందరో భవితను తీర్చిదిద్దే ఒక గురువు.. నేడు తన భార్య ప్రాణాలను కాపాడుకోవడానికి సమాజం వైపు దీనంగా చేతులెత్తి వేడుకుంటున్నారు. కాలం విసిరిన విధి వంచనకు ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. తన అర్ధాంగిని బతికించుకోవడానికి ఆ ఉపాధ్యాయుడు పడుతున్న ఆరాటం, కన్నీటి వేడుకోలు ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నాచేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గద్దపాటి శ్రీనివాస్ సతీమణి హఠాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మరణంతో పోరాడుతున్నారు. **కరిగిపోతున్న ఆశలు.. భారమవుతున్న వైద్యం** ఆమె ప్రాణాలు నిలవాలంటే అత్యంత ఖరీదైన వైద్యం అవసరమని వైద్యులు స్పష్టం చేశారు. ప్రతి వారం సుమారు రూ. 2,20,000/- (రెండు లక్షల ఇరవై వేల రూపాయలు) విలువైన ఇంజెక్షన్‌ను, వరుసగా 18 వారాల పాటు ఇవ్వాల్సి ఉందని వైద్యులు తెలిపారు. అంటే కేవలం ఇంజెక్షన్ల కోసమే దాదాపు 40 లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది. ఒక సాధారణ ప్రభుత్వ ఉపాధ్యాయుడైన శ్రీనివాస్, తన సతీమణి ప్రాణాలను దక్కించుకోవడానికి తన శాయశక్తులా ప్రయత్నించారు. ఉన్నదంతా ధారపోశారు. కానీ, ఊహించని విధంగా వచ్చిపడిన ఈ భారీ వైద్య ఖర్చులను భరించడం ఆయన శక్తికి మించిపోయింది. చికిత్స మధ్యలో ఆగిపోతే ఏమవుతుందోనన్న భయం ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది. **మీరు ఇచ్చే ప్రతి రూపాయి.. ఒక నిండు ప్రాణానికి సంజీవని!** "నా శాయశక్తులా ప్రయత్నించాను.. కానీ ఈ ఖర్చు నా శక్తికి మించింది. నా భార్యను కాపాడుకోవడానికి దాతల ఆర్థిక సాయమే శరణ్యం. ఈ క్లిష్ట సమయంలో మా కుటుంబానికి అండగా నిలిచి, చేతనైన మేరకు సహాయం అందించి నా భార్యకు పునర్జన్మ ప్రసాదించండి" అని ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కన్నీటి పర్యంతమవుతూ వేడుకుంటున్నారు. మనుషుల మధ్య దూరం పెరిగినా, మానవత్వం ఇంకా చావలేదని నిరూపించాల్సిన సమయం ఇది. మీరు అందించే సహాయం చిన్నదా, పెద్దదా అన్నది ముఖ్యం కాదు.. మీ మంచి మనసుతో ఇచ్చే ప్రతి వంద రూపాయిలు కూడా ఆ కుటుంబానికి కొండంత అండగా మారుతాయి. ఒక నిండు జీవితాన్ని కాపాడటానికి, ఒక గురువు సంసారాన్ని నిలబెట్టడానికి ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలని శ్రీనివాస్ స్నేహితులు, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. **సహాయం చేయదలచిన వారు క్రింది నెంబర్‌కు గూగుల్ పే లేదా ఫోన్ పే చేయగలరు :** ఫోన్ పే / గూగుల్ పే / యుపిఐ నెంబర్: 99516 60789 పేరు : గద్దపాటి శ్రీనివాస్ రాబోయే రోజుల్లో ఆ కుటుంబం మళ్లీ నవ్వుతూ కనిపించాలంటే అది మన చేతుల్లోనే ఉంది. దాతలు పెద్ద మనసుతో స్పందించి ఆదుకోవాలని ఆశిస్తున్నాం.

# రాష్ట్ర సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్‌లో ఉపేక్షిత్ ప్రతిభ

**- ఖమ్మం విద్యార్థి విజయకేతనం**








**ఖమ్మం ప్రతినిధి,12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్‌లో నిర్వహించిన, 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి సుధగాని ఉపేక్షిత్ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. గాడియం స్పోర్టోపియా స్కూల్ వేదికగా జరిగిన ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-12 విభాగంలో పాల్గొన్న ఉపేక్షిత్ తన వేగంతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఉపేక్షిత్, డాక్టర్ సుధగాని కరుణాకర్ - భరణిక దంపతుల కుమారుడు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కోచ్‌ల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా శిక్షణ పొందుతున్న ఉపేక్షిత్ రాష్ట్రస్థాయి పోటీల్లో 60 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 300 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించి ప్రశంసలు అందుకున్నాడు. అంతేకాకుండా ప్రైజ్ మనీని కూడా కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్‌కు మరోసారి మంచి గుర్తింపు లభించిందని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. ఉపేక్షిత్ విజయంలో కోచ్‌లు గౌస్ పాషా, హలీం, అందించిన శిక్షణ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థిని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు. అలాగే జిల్లా క్రీడా ప్రముఖులు, అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు, తల్లిదండ్రులు ఉపేక్షిత్ భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రత్యామ్నాయ రాజకీయాలే సకలజనులకు శాశ్వత పరిష్కారం

**- లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భానోత్ భద్రునాయక్, బహుజన జేఏసీ కన్వీనర్ ములకలపల్లి సంగమేశ్వరరావు**





**ఖమ్మం ప్రతినిధి,12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశంలో, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ద్వారానే సకలజనుల సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం లభిస్తుందని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భానోత్ భద్రునాయక్, బహుజన జేఏసీ కన్వీనర్ ములకలపల్లి సంగమేశ్వరరావు లు అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని హోటల్ శ్రీధర్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ సర్వజన ఫోరం(టీ.ఎస్.డి.ఎఫ్) ఆధ్వర్యంలో 'సమాలోచన సుదీర్ఘ చర్చావేదిక'లో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. తొలుత మహనీయులైన మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, సేవాలాల్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టి.ఎస్.డి.ఎఫ్ సమన్వయకర్త ఎం. సంగమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన చర్చావేదికలో సమన్వయకర్త ధారావత్ ప్రేమ్ చంద్ నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుత స్వార్థ రాజకీయ స్థితిగతుల కారణంగా సామాజిక అసమానతలు, నిరుద్యోగం, అవినీతి తాండవిస్తున్నయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నైతిక విలువలతో కూడిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. పూలే సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ప్రసాద్ పటేల్ మాట్లాడుతూ.. రాబోయే కాలంలో మన అందరి లక్ష్యాన్ని ఈ సుదీర్ఘ చర్చావేదిక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిర్దేశిస్తుందన్నారు. మరో సమన్వయకర్త సూరి మాట్లాడుతూ... స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగం కంటే ముందు బహుజనుల బ్రతుకులు ఎలాంటి చరిత్రను కలిగివుందో తెలిసిందే అన్నారు. నేడు స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ పరిస్థితిని గమనిస్తుంటే బహుజనులకు నిజంగానే స్వాతంత్ర్యం వచ్చిందా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భానోత్ భద్రునాయక్ మాట్లాడుతూ.. సమాజంలో ఎటువంటి అసమానతలు లేకుండా సామాన్య ప్రజలందరి జీవితాలు మారాలంటే వారి వారి జనాభా దామాషాను అనుసరించి వారికి తగిన వాటాలు లభించాలని కోరుకునే వాళ్లందరూ ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరాన్ని, అవశ్యకతను గుర్తించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర భాయ్, దళిత సంక్షేమ సంఘం నాయకులు నకిరికంటి సంజీవరావు, ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర్ అధ్యక్షులు యలమందల జగదీష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీను, ఎస్సీ ఉపకులాల నాయకులు ఆంతోని సురేష్ తదితరులు ప్రసంగించగా, ఈ కార్యక్రమంలో గిరిజన జేఏసీ నాయకులు కేశవ నాయక్, రాజేష్ నాయక్, కిషన్ నాయక్, కృష్ణా నాయక్, రవీంద్ర నాయక్, దశరథ నాయక్, రమేష్ నాయక్, నాగేశ్వరరావు నాయక్, అనిల్ నాయక్, వీరన్న నాయక్, బాబురావు నాయక్, రజక సంఘం నాయకులు పగిడిపల్లి నాగేశ్వరరావు, వీరభద్రం, కోటయ్య, రేగళ్ల సీతారాములు, బహుజన జేఏసీ నాయకులు వీరప్రసాద్, లక్ష్మణ్, కొమ్ము ప్రసాద్, వెంకటేశ్వర్లు, యోనా, శేషయ్య, సేవాలాల్ సేన నాయకులు రాంబాబు నాయక్, నెహ్రూ నాయక్, బంజారా ఉద్యోగ సంఘం నాయకులు శోభన్ నాయక్, ఎల్.హెచ్.పి.ఎస్ న్యాయ సలహాదారులు వీరన్న నాయక్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి నాయకులు త్రివేణి, భవాని, జ్యోతి, కళావతి, లక్ష్మి, కల్పన, శ్రీదేవి, సుధా తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో హ్యూమన్ రైట్స్ డిప్యూటీ చైర్మన్ లాల్ మహ్మద్‌కు ఘన సన్మానం



**రాజన్న సిరిసిల్ల 12(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా గొల్లపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ డిప్యూటీ చైర్మన్ లాల్ మహ్మద్ ని యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ, సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, హక్కులు ఉల్లంఘింపబడిన బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తూ, అనేక మంది సమస్యలను పరిష్కరిస్తున్న మానవతావాది లాల్ మహ్మద్ సేవలు అభినందనీయమని అన్నారు. హ్యూమన్ రైట్స్ వేదికగా ప్రజలకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే, గతంలో యువచైతన్య దీపం ఫౌండేషన్‌తో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని సామాజిక సేవలో విశిష్టమైన గుర్తింపు పొందిన లాల్ మహ్మద్ ని కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా సామాజిక సేవతో పాటు రాజకీయ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా హ్యూమన్ రైట్స్ సెక్రటరీ బండి పరశురాములు, జిల్లా అధ్యక్షుడు ఉడుగుల సురేందర్, ఫౌండేషన్ కార్యవర్గ సభ్యుడు ఎండి ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట నేడు టీడబ్ల్యూజేఎఫ్ నిరసన

**● అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ లు ఇవ్వాలి ● ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, భీమా సౌకర్యంతో సమస్యలన్నీ పరిష్కరించాలి ● జర్నలిస్టులు భారీగా తరలిరండి ● జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి,12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ - 2843) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం చేపట్టే నిరసనను విజయవంతం చేయాల్సిందిగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన జర్నలిస్టులకు సరిపడా అక్రిడిటేషన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొద్దిమందికి మాత్రమే అక్రిడిటేషన్ ల జారీ సరికాదని తెలిపారు. జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సు పాసులతో పాటు కొత్త మెట్రో పాసులను ఉచితంగా జారీచేయాలని కోరారు. ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలన్నీ పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈనెల 4న రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాలకు అనుగుణంగా జూలై 13న సోమవారం ఉదయం 11 గంటల నుంచి కలెక్టరేట్ వద్ద నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల నుంచి కూడా పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలాల్సిందిగా కోరారు.

# రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగిద్దాం

**- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి తూడుం ఝాన్సీ**




**ఖమ్మం ప్రతినిధి,12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** అమరుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ నమ్మిన సోషలిజం లక్ష్య సాధన కోసం ప్రజలు, పార్టీ కార్యకర్తలు పోరాటాలను మరింత ఉధృతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి తూడుం ఝాన్సీ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని వన్‌టౌన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ రామనాథం అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాయల చంద్రశేఖర్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాయల చంద్రశేఖర్‌కు ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థి ఉద్యమం నుంచే విప్లవ రాజకీయాల్లో అడుగుపెట్టిన చంద్రశేఖర్ ఐదు దశాబ్దాల పాటు ప్రజా విముక్తి ఉద్యమంలో అంకితభావంతో పనిచేశారని ఝాన్సీ అన్నారు. ఎమర్జెన్సీ కాలంలో రహస్య జీవితాన్ని గడుపుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు భూముల కోసం సాగిన పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని, ఖమ్మం, వరంగల్, పశ్చిమ గోదావరి, గుంటూరు, హైదరాబాద్ జిల్లాల్లో పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల బలోపేతానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అనేక నిర్బంధాలు, ఎన్‌కౌంటర్ ముప్పులను ఎదుర్కొంటూ చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన విప్లవ నాయకుడిగా రాయల చంద్రశేఖర్ చిరస్మరణీయులని ఆమె కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కె. శ్రీనివాస్, పార్టీ నగర సహాయ కార్యదర్శి ఇమ్మడి వెంకటేశ్వర్లు, పార్టీ వన్ టౌన్ కార్యదర్శి లెనిన్, నాయకులు వెంకన్న, చిలకల నరసింహారావు, బొమ్మ కంటి రమేష్, చింతపల్లి ధరణి కృష్ణ, చింతిరాల రమేష్, చింతపల్లి వెంకటనారాయణ, పాల్గొన్నారు.

# చల్లా ఈశ్వరమ్మ ముదిరాజ్ మృతికి షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం సంతాపం

**బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా**



**షాద్ నగర్,12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** షాద్‌నగర్ తాలూకా జెంట్స్ సెక్రటరీ గడ్డమీద రమేష్ ముదిరాజ్ అత్త చల్ల ఈశ్వరమ్మ ముదిరాజ్ మరణం పట్ల షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, చల్ల ఈశ్వరమ్మ ముదిరాజ్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ముదిరాజ్ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మంగా వెంకటేష్ ముదిరాజ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నల్లమోని భిక్షపతి ముదిరాజ్, గౌరవ సభ్యుడు చెట్ల జంగయ్య ముదిరాజ్, తాలూకా యువత అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్, యువత ఉపాధ్యక్షుడు మంగా అశోక్ ముదిరాజ్, కోశాధికారి కొండే యాదయ్య ముదిరాజ్, గౌరవ సభ్యుడు కానుగు అనంతయ్య ముదిరాజ్, కార్యవర్గ సభ్యుడు పిట్టల అంజయ్య ముదిరాజ్, గౌరవ సలహాదారులు మేకల వెంకటేష్ ముదిరాజ్, దినేష్ సాగర్ ముదిరాజ్, శ్రీహరి రాజు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా, నిద్ర మత్తు వదలని అధికార యంత్రాంగం

**కనకదుర్గా స్టీల్స్ పరిశ్రమపై పై చర్యలు తీసుకోవాలి.**

**పినపాక ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్, కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ**



**షాద్ నగర్,12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** షాద్ నగర్ నియోజక వర్గంలో ఉన్న పరిశ్రమలలో నిత్యం అనేక ప్రమాదాలు జరిగి వందలాది మంది కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నా, పరిశ్రమ లలో భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా లంచాల మత్తులో అధికార యంత్రాంగం మునిగి పోయిందని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. శనివారం నందిగామ మండలంలోని వీర్లపల్లి గ్రామంలో ఉన్న కనకదుర్గా స్టీల్ పరిశ్రమలో బాధ్యత ప్రమాణాలు లేక పోవడంతోనే బీహార్ కు చెందిన భారత్ కుమార్ మిశ్రా పై బాగా వేడి గా పౌడర్ మీద పడటంతో 75 శాతానికి పైన కాలిపోయాడని, యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తుంది . అక్కడ ఖర్చు ఎక్కువ అవుతుందనే ఉద్దేశంతో వేరే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆంధ్రా ప్రాంతానికి చెందిన యాజమాన్యం లాభాలే ధ్యేయంగా ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేకుండా పరిశ్రమను నడుపుతున్నారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు అక్కడ చనిపోయారని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుడి కి నాణ్యమైన వైద్య రందించి ఆదుకోవాలి. ఇప్పటికైనా ఈ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి. మీకు చేతకాక పోతే మమల్ని తీసుకుపోండి లోపాలను చూపిస్తాం. వెంటనే కనకదుర్గ స్టీల్ పరిశ్రమపై చర్యలు తీసుకుని మీ నిజాయితీని నిరూపించు కోవాలని అధికారులను కోరారు.

# వేముల కృషితో దశాబ్దాల రహదారి విస్తరణకు మోక్షం





**రామన్నపేట 12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏండ్లకు ఏండ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న లిభువనగిరిచిట్యాల నాలుగు లేన్ల రహదారి కల ప్రజా ప్రభుత్వంతో నేడు సాకారమైంది. లిరూ. 339.59 కోట్ల వ్యయంతో HAM (Hybrid Annuity Model) విధానంలో భువనగిరి నుండి చిట్యాల వరకు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించే నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. దశాబ్దాలుగా ఈ రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా ప్రభుత్వం ఆ కోరికను నెరవేరుస్తుం ది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడి, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుంది. ఈ కార్యక్రమంలో లిభువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చనిపోయిన గీత కార్మికుల ఎక్స్గ్రేషియా తక్షణమే ప్రకటించాలి

**● పరిటాల రవి సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు**



**రామన్నపేట 12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా గత మూడు సంవత్సరాల సంధి 900 మంది గీత కార్మికులు చెట్లు ఎక్కబోయి చనిపోయినారు రాష్ట్ర ప్రభుత్వం చనిపోయిన గీత కార్మికుల యొక్క కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలి గీత కార్మికులకు సంబంధించిన ఎక్స్గ్రేషియా డబ్బులు 15 కోట్లు తక్షణమే విడుదల చేయాలి. గీత వృత్తిపై ఆధారపడి బతుకుతున్న కార్మికులకు భరోసా తక్షణమే కల్పించాలి. సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల రవి) పత్రికా ప్రకటనలో తెలిపినారు.

# బాధిత దివ్యాంగురాలికి న్యాయం చేయాలి

**ఇల్లు, 50 లక్షల ఎక్స్గ్రేషియా, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్**

**షాబాద్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడి పై కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఎన్పిఆర్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి**



**షాద్ నగర్,12 జూలై (పిసిడబ్ల్యూ న్యూస్) :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో చోటుచేసుకున్న ఆరు హత్యల ఘటన అత్యంత విషాదకరమని, ఈ సంఘటనపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ ఘటనలో తీవ్రంగా నష్టపోయిన దివ్యాంగ మహిళకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని కోరారు. 50 లక్షల ఎక్స్గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్యం, భద్రతా వ్యవస్థలో లోపాల వల్లే పరిస్థితి ఇంత దారుణంగా మారిందని ఆయన విమర్శించారు. ఒక తప్పిదం కారణంగా రెండు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయని, అమాయకుల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. ప్రస్తుతం దివ్యాంగురాలు తీవ్ర మానసిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ఆమెకు తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం, అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ నిర్వహించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సమర్థమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

# టీమిండియా బౌలర్లను ఉతికేసిన బ్రూక్,బట్లర్




: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో ఆఖరి టీ20 మ్యాచ్‌లో భారత బౌలర్లకు ఇంగ్లీష్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. సౌతాంప్టన్‌లోని ది రోజ్ బౌల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ జోస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. భారత బౌలర్లపై సిక్సర్లు, ఫోర్లతో దండయాత్ర చేశాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు పెద్దగా ప్రభావం చూపని బట్లర్.. కీలకమైన ఆఖరి మ్యాచ్‌లో మాత్రం విశ్వరూపం చూపించారు. టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ ఇంగ్లండ్ బ్యాటర్లు మొదటి నుంచే బౌండరీల వేట సాగించారు.టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ప్రారంభంలోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (6) వికెట్ పడగొట్టి ప్రసిద్ధ్ కృష్ణ మంచి బ్రేక్‌త్రూ ఇచ్చాడు. సాల్ట్ ఇచ్చిన క్యాచ్‌ను సూర్యాన్ష్ షెడ్గే అద్భుతంగా అందుకున్నాడు. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో కలిసి జోస్ బట్లర్ ఇన్నింగ్స్‌ను పూర్తిగా మార్చేశాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 233 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలోనే బట్లర్ కేవలం 51 బంతుల్లోనే తన సెంచరీ మార్కును అందుకున్నాడు. అవుట్ అయ్యే సమయానికి బట్లర్ 64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 131 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని భారత్‌కు కోలుకోలేని దెబ్బ తీశాడు. మొత్తంగా తాను ఈ మ్యాచులో 95 పరుగులు సాధించి సెంచరీ మిస్ చేసుకున్నాడు.భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మాత్రమే 4 ఓవర్లలో 33 రన్స్ ఇచ్చి కొంతవరకు కట్టడి చేయగలిగాడు. మిగిలిన బౌలర్లందరినీ ఇంగ్లండ్ బ్యాటర్లు బెంబేలెత్తించారు. అక్షర్ పటేల్ వేసిన ఓ ఓవర్లో బ్రూక్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 25 పరుగులు రాబట్టగా.. సూర్యాన్ష్ షెడ్గే ఓవర్లో 24 పరుగులు వచ్చాయి. అయితే ఇన్నింగ్స్ 19వ ఓవర్ వేసిన శివమ్ దూబే ఓవర్ మ్యాచ్‌లోనే అత్యంత ఆసక్తికరంగా మారింది. ఆ ఓవర్లో 6, 6, 4, ఔ, ఔ, 6 చొప్పున ఏకంగా 22 పరుగులు వచ్చాయి. కాకపోతే, ఇదే ఓవర్లో దూబే సెంచరీ హీరో జోస్ బట్లర్‌ను శ్రేయస్ అయ్యర్ క్యాచ్ ద్వారా అవుట్ చేయడమే కాకుండా.. ఆ తర్వాతి బంతికే జాకబ్ బెథెల్‌ను డకౌట్‌గా వెనక్కి పంపడం విశేషం.ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ వైఫల్యాలు మరోసారి స్పష్టంగా కనిపించాయి. ప్రిన్స్ యాదవ్ వేసిన ఇన్నింగ్స్ 6వ ఓవర్లో శివమ్ దూబే అత్యంత సులువైన క్యాచ్‌ను వదిలేసి హ్యారీ బ్రూక్‌కు లైఫ్ ఇచ్చాడు. ఆ తర్వాత బట్లర్ ఇచ్చిన క్యాచ్‌ను సూర్యాన్ష్ షెడ్గే కూడా నేలపాలు చేశాడు. ఈ అందివచ్చిన అవకాశాలను వాడుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లు చివరకు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచారు. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పరువు నిలుపుకోవాలంటే టీమిండియా బ్యాటర్లు కూడా ఇదే రేంజ్‌లో భారీ హిట్టింగ్‌తో విరుచుకుపడాల్సి ఉంటుంది.

# బట్లర్, బ్రూక్ విధ్వంసం- ఐదో టీ20లోనూ భారత్ ఓటమి




ఇంగ్లాండ్‌తో ఐదో టీ20లోనూ టీమ్‌ఇండియా తీరు మారలేదు. ఈ మ్యాచ్?లో కూడా భారత్ ఓడిపోయింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 258 పరుగుల భారీ ఛేదనలో ఓవర్లన్నీ ఆడిన 8 వికెట్లు కోల్పోయి 201 రన్స్? మాత్రమే చేసింది. ఫలితంగా 56 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. ఛేజింగ్?లో ఇషాన్ కిషన్ (56), తిలక్ వర్మ (53) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడారు. బ్యాటర్లు మరోసారి విఫలమయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో శామ్ కరన్ 3, ఆదిల్ రషీద్ 2, ఆర్చర్, టంగ్, డాసన్ తలో 1 వికెట్ పడగొట్టారు.తాజా విజయంతో ఇంగ్లాండ్ సొంత గడ్డపై ఐదు మ్యాచ్?ల టీ20 సిరీస్?ను 4- 0తో దక్కించుకుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అవ్వగా, ఆ తర్వాత వరుసగా జరిగిన నాలుగు టీ20ల్లో ఆతిథ్య ఇంగ్లాండ్ నెగ్గింది. అలాగే 2026 టీ20 వరల్డ్?కప్ తర్వాత భారత్ వరుసగా రెండో టీ20 సిరీస్? కోల్పోవడం గమనార్హం. పొట్టి కప్పు ఫైనల్ తర్వాత టీమ్‌ఇండియా ఆడిన ఏడు టీ20ల్లో ఏ అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోర్ చేసింది. జాస్ బట్లర్ (131), హ్యారీ బ్రూక్ (95 నాటౌట్) చెలరేగిపోయారు భారత బౌలర్లలో శివమ్ దూబే 2, ప్రసిద్ధ్ కృష్ణ 1 వికెట్ దక్కించుకున్నారు.

# లండన్ వేటకు కింగ్ కోహ్లీ రెడీ



ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశలో గాయపడి క్రికెట్ అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ, తాజాగా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరిగిన కీలకమైన ఫిట్‌నెస్ పరీక్షలో విజయం సాధించాడు. దీంతో వచ్చే నెలలో ఇంగ్లాండ్ గడ్డపై జరగబోయే వన్డే సిరీస్‌లో అతడు బరిలోకి దిగడం ఖాయమైంది.అభిమానుల్లో జోష్.. గాయం నుంచి కోలుకున్న రారాజు..రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఐపీఎల్ ఆడుతున్న సమయంలో విరాట్ కోహ్లీకి తొడకండరాల గాయం (హ్యామ్‌స్ట్రింగ్) అయింది. ఈ గాయం కారణంగానే అతడు ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు కూడా దూరమయ్యాడు. అయితే, ఇంగ్లాండ్ టూర్ కోసం ప్రకటించిన 15 మంది సభ్యుల భారత జట్టులో కోహ్లీ పేరును చేర్చినప్పటికీ, అతడి ఎంపిక అనేది ఫిట్‌నెస్ నిరూపించుకోవడంపైనే ఆధారపడి ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది. తాజాగా సోమవారం జరిగిన ఈ ఫిట్‌నెస్ పరీక్షను కింగ్ కోహ్లీ విజయవంతంగా పూర్తి చేయడంతో సెలెక్టర్లతో పాటు కోట్లాది మంది అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.మూడో నంబర్‌లో కింగ్ రీఎంట్రీ.. మారనున్న సమీకరణాలు.విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ సాధించడంతో ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌లో భారత టాప్ ఆర్డర్ అత్యంత పటిష్టంగా మారనుంది. భారత క్రికెట్ బోర్డు వర్గాల సమాచారం ప్రకారం.. ఇంగ్లాండ్‌పై టాప్ ఆర్డర్‌లో ఎటువంటి ప్రయోగాలు ఉండవు. కెప్టెన్ శుబ్‌మన్ గిల్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మలు ఓపెనర్లుగా ఇన్నింగ్స్ ప్రారంభిస్తుండగా, విరాట్ కోహ్లీ తన సంప్రదాయ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. కోహ్లీ జట్టులోకి రావడంతో, గత సిరీస్‌లో అతడి స్థానంలో ఆడి శతకం బాదిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఈ సిరీస్‌లో చోటు దక్కలేదు.15 వేల పరుగుల మైలురాయిపై కన్ను..!ఈ ఇంగ్లాండ్ వన్డే సిరీస్ విరాట్ కోహ్లీ కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయికి వేదిక కానుంది. వన్డే క్రికెట్ చరిత్రలో 15,000 పరుగుల మార్కును అందుకోవడానికి కోహ్లీ కేవలం 203 పరుగుల దూరంలో ఉన్నాడు. ప్రస్తుతమున్న ఫామ్ ప్రకారం మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోనే కింగ్ కోహ్లీ ఈ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. జూలై 14 నుంచి ప్రారంభం కానున్న ఈ వన్డే సిరీస్‌లో జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్‌లు కూడా జట్టులోకి తిరిగి రావడం భారత్‌కు అదనపు బలాన్ని ఇస్తోంది.

# ఆషాఢంలో బంగారం ధర పెరుగుతుందా? తగ్గుతుందా..?



ఆషాడ మాసం ప్రారంభం కానుంది. ప్రస్తుతం బంగారం, వెండి ధరలు ఊగిసలాడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన బంగారం, వెండి ధరలు క్రమంగా దిగి వస్తున్నాయి. అయితే గత నాలుగైదు రోజుల నుంచి బంగారం, వెండి ధరలు పెద్దగా దిగడం లేదు.. పెద్దగా తగ్గడం లేదు. స్వల్ప మార్పులతో కొనసగుతున్నాయి. తాజాగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది. అయితే నిన్న ఒక్క రోజు బంగారం ధర రూ.500 వరకు తగ్గుముఖం పట్టింది. అదే వెండి ధర రూ.500 వరకు తగ్గింది. తాజాగా జూలై 12 దేశంలోని ప్రధాన నగరాల్లో ధరల వివరాలు తెలుసుకుందాం. .హైదరరాబాద్ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.విజయవాడ -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.ఢిల్లీ- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,480 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,450 వద్ద కొనసాగుతోంది.ముంబై -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.చెన్నై - 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,33,000 వద్ద కొనసాగుతోంది.బెంగళూరు -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.కోల్‌కతా -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.కేరళ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. హైదరాబాద్, చెన్నై, చెన్నైలలో కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద కొనసాగుతుండగా, ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా ఇతర నగరాల్లో రూ.2,35,000 వద్ద ట్రేడవుతోంది. వెండి ధర నిన్న ఒక్క రోజే 5000 రూపాయల వరకు దిగి వచ్చింది.సాధారణంగా లోకల్ సెంటిమెంట్ ఆధారంగా చూసినట్లయితే బంగారం ధరలు ఆషాడంలో తగ్గుతాయని చాలామంది భావిస్తూ ఉంటారు. దీనికి ఒక ప్రధానమైన కారణం ఉంది ఎందుకంటే ఆషాడమాసంలో పెళ్లిళ్లు శుభకార్యాలు జరగవు. ముఖ్యంగా ఆషాడ మాసంలో బంగారు ఆభరణాల షాపింగ్ కూడా చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపించరు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బంగారు దుకాణాల యాజమాన్యాలు కస్టమర్లను ఆకర్షించేందుకు అనేక ఆఫర్లను కూడా ముందుకు తెస్తుంటాయి. అందుకే ఈ మాసంలో ధరలు తగ్గే అవకాశాలు ఉంటాయని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

# పీఎఫ్ వడ్డీ అకౌంట్లోకి వచ్చేసింది.




ఈపీఎఫ్ఓ ఖాతాదారులకు కేంద్రం గుడ్ న్యూస్ తెలిపింది. పీఎప్ వడ్డీ జమ చేయడం ప్రారంభించింది. ఇప్పటికే చాలామంది ఖాతాల్లోకి వడ్డీ నగదు వచ్చేసింది. జూలై 15 లోపు అందరి ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఈపీఎఫ్ఓ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతం వడ్డీ ప్రకటించింది. ఇప్పుడు దాని ప్రకారం జమ చేస్తోంది. సుమారు రూ.1.44 లక్షల కోట్లకు పైగా వార్షిక వడ్డీని ఆటోమేటిక్‌గా ప్రాసెస్ చేసి, ఆ తర్వాత ఫీల్డ్ అథారిటీలచే ధృవీకరించి సభ్యుల ఖాతాలకు పీఎఫ్ సంస్థ జమ చేస్తోంది. అయితే మీకు వడ్డీ పడిందా.. లేదా అనేది ఎలా చెక్ చేసుకోవాలో చూద్దాం.యూఏఎన్ పోర్టల్ ద్వారా ఎలా చెక్ చేసుకోవాలి..నెంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా ఉపయోగించి సైన్ ఇన్ ేయండి-మీ ఆధార్ లింక్డ్ ఫోన్ నంబర్‌కు వచ్చిన ఞాని నమోదు చేయండి.

-సంబంధిత కంపెనీ ×ణని ఎంచుకోండి.

-"పాస్‌బుక్‌ను వీక్షించండి" పై క్లిక్ చేయండి

పడిందనేది చెక్ చేసుకోవచ్చుఉమాంగ్ యాప్ ద్వారా చెక్ చేసుకోవడం ఎలా..-గూగుల్ ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుండి ఉమాంగ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి-ఆ తర్వాత యాప్‌ను తెరిచి సెర్చ్‌లో జూఖీూ అని సెర్చ్ చేయండి

-ఈపీఎఫ్‌వో సేవలను ఎంచుకోండి

-అనంతరం పాస్‌బుక్ ఆప్షన్‌పై క్లిక్ చేయండి

- నెంబర్ ఎంటర్ చేసి మొబైల్‌కు పంపిన ఞాని నమోదు చేసింది-అనంతరం యజమాని ఖాతాను ఎంచుకోండి-అక్కడ పీఎఫ్ బ్యాలెన్స్‌లో వడ్డీని చెక్ చేసుకోవచ్చుమిస్డ్ కాల్ నంబర్ ద్వారా తెలుసుకోవడం ఎలా..


-మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుండి 9966044425 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వండి-రెండు రింగుల తర్వాత కాల్ ఆటోమేటిక్‌గా డిస్‌కనెక్ట్ అవుతుంది

# లోన్లు తీసుకునేవారికి ఆర్బీఐ సడెన్ షాక్.. అమల్లోకి రానున్న కఠిన రూల్స్..




మీ క్రెడిట్ స్కోర్ 730 కంటే తక్కువగా ఉందా..? అయితే మీకు లోన్లు రావడం ఇక కష్టం కావొచ్చు. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కఠిన నిబంధనలను అమల్లోకి తీస్నుకురానుంది. ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ పేరుతో కొత్త రూల్స్‌ను ఆర్బీఐ ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచిఈ కొత్త నిబంధనలను అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నియమాలతో 730 కంటే సిబిల్ స్కోర్ తక్కువ ఉన్న వారికి రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులకు మరింత కఠి నిబంధనలు విధించారు. దీంతో క్రెడిట్ హిస్టరీ సరిగ్గా లేకపోయినా, తక్కువగా ఉన్నా రుణ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం తక్కువగా ఉంటుంది.సిబిల్ తక్కువుంటే రుణం కష్టమేఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ (జుజూ) డైరెక్షన్-2026 ఫ్రేమ్‌వర్క్‌ను ఆర్బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకురానుంది. ఇది బ్యాంకింగ్ రంగంలో ఒక కీలకమైన సంస్కరణగా చెప్పవచ్చు. ఈ సంస్కరణల ప్రకారం 730 కంటే తక్కువ సిబిల్ స్కోర్ ఉన్నవారు రుణాలు పొందే విషయంలో కఠినమైన పరిశీలనను ఎదుర్కొంటారు. అధిక వడ్డీ రేట్లు, అదనపు పూచీకత్తు సమర్పించడం వంటి సమస్యలు రావొచ్చు. దేశంలోని రుణ దరఖాస్తుదారులలో 62 శాతం మంది ఈ వర్గంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత వ్యవస్థ ప్రకారం బ్యాంకులు రుణ డిఫాల్ట్‌లు జరిగిన తర్వాతే స్పందిస్తున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం బ్యాంకులు భవిష్యత్ డేటాను ఉపయోగించి రుణగ్రహీత రిస్క్‌ను నిరంతరం అంచనా వేస్తాయి. ఈఎంఐ ఆలస్యంగా చేయడం, అస్థిరమైన ఆదాయ సరళి, క్రెడిట్ వినియోగంలో ఆకస్మిక పెరుగుదల వంటి వాటిని పరిగణలోకి తీసుకుని పూర్తిగా రుణ ద ం ఖ ా స ు ల ు తిరస్కరించవచ్చు.రానున్న రోజుల్లో కష్టమే


కొత్త రూల్స్ వల్ల 730 కంటే ఎక్కువ సిబిల్ స్కోర్ ఉన్న సుమారు 7 కోట్ల ప్రీమియం కస్టమర్లకు బ్యాంకులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. వీరికి బహుమతులు అందించడంతో పాటు పోటీతత్వంతో కూడిన ఆర్థిక ఉత్పత్తుల పూర్తి శ్రేణితో సేవలు అందిస్తారు. మిగతా అందరికీ రుణం అందటం కష్టంగా మారవచ్చు. అయితే సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు, స్టెప్-అప్ లోన్ ఉత్పత్తులు, సూక్ష్మ రుణ మార్గాలు వంటి వాటిని తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్నవారి కోసం అందుబాటులో ఉంచను న్నారు. ప్రతిని పరిగణలోకి తీసుకుని పూర్తిగా రుణ దరఖాస్తులు తిరస్కరించవచ్చు.రానున్న రోజుల్లో కష్టమేకొత్త రూల్స్ వల్ల 730 కరస్తుతం బ్యాంకులు సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నా తమకు నమ్మకమైన కస్టమర్‌గా ఎక్కువ కాలం పాటు కొనసాగుతుంటే రుణాలు చేస్తున్నాయి. కానీ రానున్న రోజుల్లో ఈ విధా నంలో రుణాలు పొందటం కష్టం కావొచ్చు. ఆర్బీఐ నియమాలు అందుకు అనుమతించవు.



# ఉదయం లేవగానే ముఖానికి ఉమ్మి రాస్తా..

సినీరంగంలో హీరోహీరోయిన్స్ తమ లుక్స్, ఫిట్నెస్ పై ఎంతో శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా సీనియర్ తారలు ఇప్పుడు వర్కవుట్స్ పై ఫోకస్ పెట్టారు. ఇదిలా ఉంటే.. సినిమా ఇండస్ట్రీలో మోస్ట్ గ్లామరస్ అండ్ ఫ్లాలెస్ స్కిన్ ఉన్న హీరోయిన్లలో మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా ఒకరు. తెలుగులో ఈ అమ్మడుకు ఉన్న క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. నార్త్ నుంచి సౌత్ వరకు దాదాపు అందరు అగ్ర హీరోల సరసన నటించిన ఈ ముద్దుగుమ్మ... ఇప్పుడు ఓటీటీల్లో ఎక్కువగా వెబ్ సిరీస్ చేస్తుంది. అంతేకాకుండా అటు యాడ్స్ ద్వారా బిజీగా ఉంటుంది. అయితే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి దశాబ్దాలు దాటిన ఈ అమ్మడు అందం ఏమాత్రం తగ్గడం లేదు. ఇప్పటికీ కుర్ర భామలకు పోటీగా ఫిట్నెస్, లుక్స్ మెయింటైన్ చేస్తుది. అయితే ఈ అమ్మడు అందం వెనుక ఉన్న రహస్యం ఏంటా అని అభిమానులు ఎప్పుడూ ఆరా తీస్తూనే ఉంటారు. అయితే తాజాగా తమన్నా తన స్కిన్ కేర్ రొటీన్‌కు సంబంధించి రివీల్ చేసిన ఒక ఇంట్రెస్టింగ్ అండ్ షాకింగ్ న్యూస్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది.ముఖంపై వచ్చే పింపుల్స్ (మొటిమలు), మచ్చలను తగ్గించుకోవడానికి తమన్నా ఎవరూ ఊహించని ఒక వింత చిట్కాను పాటిస్తుందట. అదేంటంటే.. ఆమె తన ముఖ రక్షణ కోసం సొంత లాలాజలాన్ని (ఖుశ్రీఅజు) ఫేస్‌పై అప్లై చేస్తుందట! వినడానికి కొంచెం వింతగా ఉన్నా ఇది నిజం. సహజంగా ఉదయాన్నే నిద్ర లేవగానే నోట్లో ఉండే లాలాజలంలో ఎన్నో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయని నమ్ముతారు. ముఖంపై మొటిమలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు, రాత్రి పడుకునే ముందు లేదా ఉదయాన్నే లాలాజలాన్ని ఆ పింపుల్స్‌పై రాస్తే అవి త్వరగా తగ్గిపోతాయని కొందరి అభిప్రాయం. ఇప్పుడు తమన్నా కూడా ఇదే ప్రాచీన, సహజసిద్ధమైన పద్ధతిని ఫాలో అవుతూ తన చర్మాన్ని మొటిమల బారి నుంచి కాపాడుకుంటున్నట్లు సమాచారం.సాధారణంగా సెలబ్రిటీలు అనగానే వేలకు వేలు ఖరీదు చేసే బ్యూటీ ప్రొడక్ట్స్, కెమికల్ ట్రీట్‌మెంట్స్

# జానకమ్మ చివరి కోరిక అదే..




లెజెండరీ గాయని ఎస్. జానకి గారి మృతితో సినీరంగంలో విషాదచాయలు అలుముకున్నాయి. కొన్నిరోజుల క్రితం ఆమె కోడుకును కోల్పోయారు. దీంతో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు. మరోవైపు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె.. శనివారం సాయంత్రం మైసూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉండగా గుండెపోటు వచ్చింది. దీంతో తుదిశ్వాస విడిచారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో ఎస్ జానకి గారు మాట్లాడుతూ... తన జీవితంలోని వివిధ కోణాలను, వ్యక్తిగత నమ్మకాలను, ఆధ్యాత్మిక అన్వేషణను, సంగీత ప్రపంచంపై తన లోతైన ఆలోచనలను పంచుకున్నారు. ఆమె కట్టు, బొట్టు విషయంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రశ్నించగా, తన ప్రియమైన వ్యక్తిని కోల్పోయిన తర్వాత రంగు చీరలు, జరీతో కూడిన వస్త్రాలు ధరించడం మానేసినట్లు తెలిపారు. అప్పటి నుండి కేవలం తెలుపు రంగు వస్త్రాలనే ధరిస్తున్నట్లు, సిల్క్ చీరలు కూడా కట్టడం లేదని చెప్పారు. అలాగే, గతంలో తాను పెద్ద బొట్టు పెట్టుకునేదాన్నని, దానికి ఒక విలువ ఉండేదని, అయితే ప్రస్తుతం బొట్టు పెట్టుకోవడానికి ఇష్టపడటం లేదని, తను లేనప్పుడు దానికి విలువ లేదని ఆమె భావిస్తున్నారని వివరించారు.జానకి గారికి ఈ వయసులో ఉన్న కోరికల గురించి అడగగా, తనకు ఏ కోరికలు లేవని, నిండైన జీవితాన్ని చూశానని తెలిపారు. అయితే, “నేను ఎవరు?” అని తెలుసుకోవాలనే ఆకాంక్ష మాత్రమే తనకు మిగిలిందని ఆమె స్పష్టం చేశారు. ప్రతి మనిషి తెలుసుకోవాల్సింది ఇదేనని, మనం ఈ దేహం కాదని, మనలో ఉండే పరమాత్మను తెలుసుకోవాలని ఆమె తెలిపారు. ఈ దేహం ఒక కారణంతో వస్తుందని, కానీ నిజమైన మన అస్తిత్వం పరమాత్మలోనే ఉందని ఆమె విశ్వసించారు. ఈ జ్ఞానం లభిస్తే ఇంక జీవించాల్సిన అవసరం ఉండదని, అది తెలిసే వరకు ఈ దేహాన్ని కాపాడమని ప్రార్థించాలన్నారు. ఈ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఆలస్యం చేయకుండా ప్రతి మనిషి తొందరపడాలని, మిగిలినవన్నీ తినడం, పడుకోవడం, పోవడం, మళ్ళీ రావడం వంటి రొటీన్ కార్యకలాపాలేనని ఆమె వివరించారు. ఆత్మ మళ్ళీ పుడుతుందని, ఆత్మ పరమాత్మలో ఐక్యం కావాలంటే పరమాత్మ ఎవరని మనం తెలుసుకోవాలి అని ఆమె తన ఆధ్యాత్మిక చింతనను పంచుకున్నారు.



# క్షణ క్షణం ఉత్కంఠ.. జనాలు తెగ చూస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్..

ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఒక యాక్షన్ థ్రిల్లర్ డ్రామా తెగ వైరలవుతుంది. ఆ సినిమా పేరు అనలి. ఈ మూవీ ప్రస్తుతం ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ఒక తల్లి తన బిడ్డను రక్షించుకోవడానికి పడే తపన, చేసే పోరాటమే ఈ సినిమా ముఖ్య కథాంశం. థ్రిల్లర్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ చిత్రం ఒక విభిన్నమైన అనుభూతిని అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది.‘జాన్సి’ అనే ఒక సామాన్యమైన మహిళ, ఆమె ఎనిమిదేళ్ల చిన్నారి ఒక ఊహించని ప్రమాదకరమైన పరిస్థితిలో చిక్కుకుంటారు. ఒక భయంకరమైన రాత్రి వేళ ముగ్గురు క్రూరమైన వ్యక్తులు వారిని వేటాడుతుంటారు. ఆ ముగ్గురు హంతకుల బారి నుంచి తన బిడ్డను కాపాడుకోవడానికి ఆ తల్లి ఎలాంటి సాహసాలు చేసింది? తన తెలివితేటలు, మనోధైర్యంతో ఆ రాత్రిని ఎలా దాటగలిగింది? అనేదే సినిమా. సింథియా లూర్దే (జఎత్ప్రఖు రాశీబతీఎవ) ప్రధాన పాత్ర అయిన జాన్సిగా అద్భుతమైన నటనను కనబరిచారు. ఒకవైపు భయం, మరోవైపు బిడ్డను రక్షించుకోవాలనే పట్టుదలను ఆమె తన నటనతో పండించారు.‘జాన్సి’ అనే ఒక సామాన్యమైన మహిళ, ఆమె ఎనిమిదేళ్ల చిన్నారి ఒక ఊహించని ప్రమాదకరమైన పరిస్థితిలో చిక్కుకుంటారు. ఒక భయంకరమైన రాత్రి వేళ ముగ్గురు క్రూరమైన వ్యక్తులు వారిని వేటాడుతుంటారు. ఆ ముగ్గురు హంతకుల బారి నుంచి తన బిడ్డను కాపాడుకోవడానికి ఆ తల్లి ఎలాంటి సాహసాలు చేసింది? తన తెలివితేటలు, మనోధైర్యంతో ఆ రాత్రిని ఎలా దాటగలిగింది? అనేదే సినిమా. సింథియా లూర్దే (జఎత్ప్రఖు రాశీబతీఎవ) ప్రధాన పాత్ర అయిన జాన్సిగా అద్భుతమైన నటనను కనబరిచారు. ఒకవైపు భయం, మరోవైపు బిడ్డను రక్షించుకోవాలనే పట్టుదలను ఆమె తన నటనతో పండించారు.నెగెటివ్ పాత్రల్లో కబీర్ దుహాన్ సింగ్, శక్తి వాసు (రాష్ట్రునిస్త్రఉ ఝంబ) తమ నటనతో మెప్పించారు. దినేష్ దేనా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కథకు మరింత బలాన్ని చేకూర్చాయి. సర్వైవల్ థ్రిల్లర్ సినిమాలకు ఉండే క్రేజ్ దృష్ట్యా, ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ మూవీ మంచి వీక్షక ఆదరణను సొంతం చేసుకుంది. హిందీ, తమిళ వెర్షన్లతో పాటు దక్షిణాది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ ప్రస్తుతం టాప్ ట్రెండింగ్ సినిమాల్లో ఒకటిగా నిలిచిందినెగెటివ్ పాత్రల్లో కబీర్ దుహాన్ సింగ్, శక్తి వాసు (రాష్ట్రునిస్త్రఉ ఝంబ) తమ నటనతో మెప్పించారు. దినేష్ దేనా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కథకు మరింత బలాన్ని చేకూర్చాయి. సర్వైవల్ థ్రిల్లర్ సినిమాలకు ఉండే క్రేజ్ దృష్ట్యా, ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ మూవీ మంచి వీక్షక ఆదరణను సొంతం చేసుకుంది. హిందీ, తమిళ వెర్షన్లతో పాటు దక్షిణాది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ ప్రస్తుతం టాప్ ట్రెండింగ్ సినిమాల్లో ఒకటిగా నిలిచింది

# లెనిన్?లో భాగ్యశ్రీ అక్క పాత్రలో నటించిన ఈ అమ్మాయి ఎవరో తెలుసా..




అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ ‘లెనిన్’ బాక్సాఫీస్ వద్ద థియేటర్లలో సూపర్ రన్ అవుతోంది. ఈ సినిమాలో అఖిల్ పర్ఫార్మెన్స్, హీరోయిన్‌గా భాగ్యశ్రీ భోర్సే నటన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మొదటి రోజే ఈ చిత్రం రూ. 16.7 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతుంది. ఇక ఇప్పుడు శనివారం, ఆదివారాల్లో ఈ మూవీ కలెక్షన్స్ మరింత పెరిగే ఛాన్స్ ఉందని అంటున్నారు సినీవిశ్లేషకుల. చాలా కాలం తర్వాత అఖిల్ ఖాతాలో మొదటి సారి సాలిడ్ హిట్ పడింది. శనివారం ఈ మూవీ సక్సెస్ మీట్ నిర్వహించింది చిత్రయూనిట్. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ భాగ్యశ్రీ కంటే ఎక్కువగా అందరి దృష్టిని ఆకర్షిస్తూ, కథను ఊహించని మలుపులు తిప్పిన ఒక కీలక పాత్ర ఉంది. అదే హీరోయిన్ అక్క ‘వైదేహి’ క్యారెక్టర్!సినిమా చూసి థియేటర్ల నుంచి బయటకు వస్తున్న ఆడియన్స్ అంతా.. ఆ వైదేహి పాత్రలో నటించిన అమ్మాయి ఎవరబ్బా అని గూగుల్‌లో తెగ వెతికేస్తున్నారు. ఎందుకంటే ఆ క్యారెక్టర్‌తో సినిమాలో వచ్చే రెండు పెద్ద ట్విస్ట్‌లు ప్రేక్షకులను షాక్‌కు గురిచేస్తున్నాయి. దీంతో ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి తెగ ప్రయత్నిస్తున్నారు మేకర్స్. ఇంతకీ ఈ వైదేహి పాత్రలో నటించిన బ్యూటీ ఎవరో తెలుసా. ఆమె మరెవరో కాదు.. పక్కా తెలుగమ్మాయి శ్రావణి కృష్ణవేణి రెడ్డి గుంతబిల్లు. శ్రావణి కెరీర్ తొలినాళ్లలో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, పలు షార్ట్ ఫిలిమ్స్ ద్వారా తన టాలెంట్ నిరూపించుకుంది. ఒకవైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే, సినిమాపై ఉన్న ప్యాషన్‌తో ఆడిషన్స్ ఇస్తూ అవకాశాల కోసం ప్రయత్నించింది. ఈ క్రమంలోనే గతేడాది విడుదలైన ‘లవ్ రెడ్డి’ సినిమాలో హీరోయిన్‌గా నటించి, తన ఎమోషనల్ యాక్టింగ్‌తో విమర్శకుల ప్రశంసలు అందుకుంది.ఇప్పుడు ‘లెనిన్’ సినిమాలో కేవలం హీరోయిన్ అక్కగానే కాకుండా, కథను మలుపు తిప్పే అత్యంత ప్రాధాన్యత ఉన్న పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించింది. ఈ సినిమాతో పాటు ప్రస్తుతం కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్న ‘గువ్వల చెరువు ఘాట్’




# అయ్యగారే నెంబర్ వన్

అక్కినేని అఖిల్ ప్రధాన పాత్రలో నటించిన లేటేస్ట్ మూవీ లెనిన్. డైరెక్టర్ మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అఖిల్ సరసన భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా నటించింది. శుక్రవారం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ మూవీ ఉదయం నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. ఈ క్రేజీ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ సినిమాను చూసేందుకు అడియన్స్ తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఇక మొదటి రోజే ఈ సినిమాకు ఊహించని స్థాయిలో కలెక్షన్స్ వచ్చాయి. తాజాగా ఈ మూవీ బాక్సాఫీస్ లెక్కలు అధికారికంగా ప్రకటించారు మేకర్స్. సినిమాకు వస్తున్న రెస్పాన్స్ గురించి చెబుతూ.. చిత్ర నిర్మాణ సంస్థ లెనిన్ మూవీ వరల్డ్ వైడ్ కలెక్షన్స్ అధికారిక పోస్టర్ రిలీజ్ చేసింది.లెనిన్ సినిమా మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 16.7 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. అఖిల్ కెరీర్ లోనే ఎంట్రీ ఇచ్చి పదేళ్లు పూర్తైనా ఇప్పటివరకు సరైన హిట్టు పడలదనే వెలితిని ఈ సినిమా తుడిచేసింది. సినిమా ప్రారంభం నుంచే అఖిల్ పర్ఫార్మెన్స్, స్క్రీన్ ప్లే ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈ చిత్రానికి జూనియర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్, ఇంటర్వెల్ ట్విస్టులు ప్రేక్షకులను ఆద్యంతం మెప్పిస్తున్నాయి. ఇక ఇప్పుడు రెండవ శనివారం, ఆదివారం కావడంతో ఈ సినిమా వసూళ్లు మరింత పెరగడం ఖాయమని తెలుస్తోంది. ముఖ్యంగా ఈచిత్రానికి ప్రధాన బలం స్క్రీన్ ప్లే అని సినీ విశ్లేషకులు అంటున్నారు. పక్కా మాస్ ఎలిమెంట్స్, స్క్రీన్ ప్లేతో విమర్శకులను మెప్పించాడు డైరెక్టర్ మురళీ కిషోర్ అబ్బూరి. ప్రస్తుతం ఈ మూవీ థియేటర్లలో దూసుకుపోతుంది.

# 50 ఏళ్ల వయసులోనూ పాతికేళ్ల కుర్రాడిలా..



షూటింగ్స్ లేనప్పుడు ఆయన రోజువారీ జీవితం ఎలా ఉంటుంది, ఆయన ఫిట్‌నెస్ వెనుక ఉన్న రహస్యాలు ఏమిటో ఒక ఇంటర్వ్యూలో ఆయనే స్వయంగా పంచుకున్నారు. సుమంత్ తనకు ఉదయం వేళలంటే చాలా ఇష్టమని, తాను ‘మార్నింగ్ పర్సన్’ అని చెప్పారు. షూటింగ్ లేని రోజుల్లో ఉదయం 6:30 నుండి 7:30 గంటల మధ్యలో నిద్ర లేస్తారు. నిద్ర లేవగానే ఆయన చేసే మొదటి పని తనకోసం తానే స్వయంగా రెండు కప్పుల టీ తయారు చేసుకోవడం. ఆ టీలో పాలు, చక్కెర చాలా తక్కువగా ఉండేలా చూసుకుంటారు.టీ కప్పుతో తన ఇంటి తోటలోకి వెళ్లి, ఎలాంటి ఆలోచనలు లేకుండా ప్రశాంతంగా మొక్కలను, ఆకులను చూస్తూ దాదాపు రెండు గంటల సమయం గడుపుతారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయం నుండి ఆయనకు ఈ గార్డెనింగ్ హాబీగా మారిందని, ఇది తన తాతగారైన అక్కినేని నాగేశ్వరరావు గారి నుండి వచ్చి ఉండవచ్చని సుమంత్ గుర్తుచేసుకున్నారు.టీ కప్పుతో తన ఇంటి తోటలోకి వెళ్లి, ఎలాంటి ఆలోచనలు లేకుండా ప్రశాంతంగా మొక్కలను, ఆకులను చూస్తూ దాదాపు రెండు గంటల సమయం గడుపుతారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయం నుండి ఆయనకు ఈ గార్డెనింగ్ హాబీగా మారిందని, ఇది తన తాతగారైన అక్కినేని నాగేశ్వరరావు గారి నుండి వచ్చి ఉండవచ్చని సుమంత్ గుర్తుచేసుకున్నారు.ఉదయం ప్రశాంతత తర్వాత సుమంత్ ప్రతిరోజూ క్రమం తప్పకుండా రెండు గంటల పాటు జిమ్‌లో వర్కవుట్ చేస్తారు. ఈ వర్కవుట్ సమయంలో బోర్ కొట్టకుండా వెయిట్స్ లిఫ్ట్ చేస్తూనే ఏదైనా సినిమా, షో లేదా పాడ్‌కాస్ట్ వినడం ఆయనకు అలవాటు. ఇక ఆహారం విషయానికి వస్తే, సుమంత్ హోమ్ ఫుడ్ (ఇంటి వంట) తినడానికే ఇష్టపడతారు.ఉదయం ప్రశాంతత తర్వాత సుమంత్ ప్రతిరోజూ క్రమం తప్పకుండా రెండు గంటల పాటు జిమ్‌లో వర్కవుట్ చేస్తారు. ఈ వర్కవుట్ సమయంలో బోర్ కొట్టకుండా వెయిట్స్ లిఫ్ట్ చేస్తూనే ఏదైనా సినిమా, షో లేదా పాడ్‌కాస్ట్ వినడం ఆయనకు అలవాటు. ఇక ఆహారం విషయానికి వస్తే, సుమంత్ హోమ్ ఫుడ్ (ఇంటి వంట) తినడానికే ఇష్టపడతారు.